17 . 08. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

ఆదివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 81 , పేజీలు : 12 వెల:రూ.5/-

SIMULANEOUSLY PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## నడుమంటి వరద నీళ్లు దాటుకుంటూ వెళ్లిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

- వరద ప్రాంతాల్లో విస్తృత పర్యటన

**ఆదిలాబాద్ వెలుతురు ఆగస్టు 16:** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. జిల్లా

# మరింత అప్రమత్తంగా ఉండాలి

### భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన

### క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని అధికారులు, సిబ్బందికి ఆదేశం...



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 16:** భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. జగిత్యాల మినహా 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని సీఎం తెలిపారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడతారని సీఎం తెలిపారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని.... పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి



భరతమాత ముద్దుబిడ్డ

# వాజ్ పేయి

- గ్రామ స్వరాజ్య స్థాపనకు తపించిన క్రుషీవలుడు
- ప్రజాస్వామ్య ఫలాలను పేదలకు అందించిన మహనీయుడు వాజ్ పేయి
- ప్రతిపక్షమంటే ప్రజల పక్షమని నిరూపించిన గొప్ప నేత
- వాజ్ పేయి బాటలో నడుస్తూ భారత్ ను “విశ్వగురు”గా తీర్చిదిద్దుతున్న మోదీ
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- వాజ్ పేయి వర్దంతి సందర్భంగా నివాళి అర్పించిన సంజయ్



# రజనీకి చంద్రబాబు, మోడీల అభినందనలు

### - కృతజ్ఞతలు తెలిపిన తలైవా రజనీ కాంత్



**చెన్నై,ఆగస్ట్16( వెలుతురు):** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ధన్యవాదాలు తెలిపారు. తలైవా ఇండస్ట్రీక్రి వచ్చి 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రెండు రోజుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఆయనకు అభినందనలు తెలిపారు. చంద్రబాబు పోస్ట్‌ను

# ఉద్యమకారులనుకనే వాళ్లకు వేలకోట్లు ఎక్కడివి?

- అసలైన ఉద్యమకారులు తాము ఉద్యమకారులమని చెప్పకోలే
- కొందరు గాలి ప్రణాళికలతో దేశాన్ని ఏలాలలని చూశారు
- వ్యక్తిగత కక్షలకోసం రాజకీయాలు వాడుకునే స్థాయిలో లేను
- అందెశ్రీ హసిత భాష్పాలు పుస్తకావిష్కరణలో సిఎం రేవంత్

**హైదరాబాద్, ఆగస్టు16(వెలుతురు):** తెలంగాణ ఉద్యమంలో ఆనాటి నుంచినేటి వరకు ...అసలైన ఉద్యమకారులు ఎవరు కూడా తాము ఉద్యమకారుణ్ణి అని చెప్పుకోలేదని, కొద్ది మంది ఉద్యమకారులని చెప్పుకునే వాళ్లకి టీవీలు, పేపర్లు, వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో తనకు అర్థం కావడం లేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొందరు గాలికి అనుకూలంగా ప్రణాళికలు వేసుకుని, దేశానికి నాయకత్వం వహించాలనే దురాశతో తెలంగాణ పేరు, పేగు బంధాన్ని తెంచుకున్నారని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి అన్నారు. తాను ఎవరిని కూడా శత్రువుగా చూడనని, తాను శత్రువుగా చూడాలంటే వాళ్లకు స్థాయి ఉండాలని అన్నారు. 2040 వరకు క్రియాశీలక రాజకీయాల్లో ఉంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.





# పోలవరంను కూలవరం అనగలరా?

- అక్కడో నీతి..ఇక్కడో నీతా,
- కాళేశ్వరంను ఎందుకు రిపేర్ చేయరు
- బిజెపి, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ కెటీఆర్

**హైదరాబాద్,ఆగస్ట్16( వెలుతురు):** కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా? అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. ఎన్నికల వేళ అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై విమర్శలు చేస్తున్నారు. 24 గంటల్లో భాజపా నేతలు ఎన్డీఎస్‌ఏను దించి భారత రాష్ట్ర సమితిపై బురదజల్లారు. కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్‌పై భాజపా నేతలు మౌనంగా ఉన్నారు. పోలవరం కాఫర్ డ్యామ్ రెండోసారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. మేడిగడ్డలో 2 పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని





# రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవికి అర్హుడు కాదా...!?

- పలు మార్లు ఎమ్మెల్యేగా, యం.ఎల్సీగా, గెలిచిన వాడికి అర్హత లేదా..!?
- మంత్రి పదవి పొందాలంటే అర్హతలేంటి..!?
- కులం చిచ్చులకు మంత్రి పదవులంటే సిగ్గుచేటు...!?
- కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు అవసరం...!
- ఇది అడ్డదారిలో అడిగే పదవి కాదు కదా..!?
- కుటుంబ నేపథ్యంతో పని లేదు...!?
- అన్న గెలిచాడు, తమ్ముడు కూడా పలు మార్లు గెలిచాడు..!?
- కులం కార్డు కంటే హీనమైనవా రాజగోపాల్ రెడ్డి గెలుపులు...!?
- ఒక్కసారి గెలిచినోళ్లే మంత్రులైతే ఇన్ని సార్లు ప్రజా క్షేత్రంలో గెలిచినోడు... ఏం కావాలి..!?
- పార్టీ చిత్తశుద్ధితో అలోచించకుంటే చిరిగే విస్తరి అవ్వటం ఖాయం..!?

**హైదరాబాద్ వెలుతురు ఆగష్టు 16, 2025:** కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి రాష్ట్రములో ఈ పేరు తెలియని వారుండరు. దేశ రాజకీయాల్లో సైతం అన్ని పార్టీల నాయకులకు తెలిసిన పేరు అని నిరాటంకంగా చెప్పవచ్చు. ఇక గత పది సంవత్సరాల రాజకీయంలో తనదైన శైలిని ప్రదర్శిస్తూ గత ప్రభుత్వంపై సైతం పలుమార్లు విరుచుకుపడ్డ వ్యక్తిగా రాజగోపాల్ రెడ్డిది ప్రత్యేక స్థానం. ఇక ప్రజల్లో సైతం ఇచ్చినమాటపై నిలబడే నాయకుడిగా, వ్యక్తిగా రాజగోపాల్ రెడ్డికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది అనటంలో ఎలాంటి సందేహం లేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సైతం భువనగిరి ఇంచార్జిగా తనముద్రను బలంగా ముద్రించుకున్నాడు అనటంలో ఎలాంటి అతిషయోక్తిలేదు. మరి ఇలాంటి వ్యక్తిని అన్నకు మంత్రి పదవి ఉందని తమ్ముడిని పక్కన పెట్టటం ఎంతవరకు సరైనదో పార్టీ అలోచించాలి. ఎందుకంటే రాజగోపాల్ రెడ్డి కూడా ప్రజా క్షేత్రంలో పలు పదవులకు పోటీచేసి ప్రతి పదవికి ప్రజలచేత ఎన్నుకోబడిన వ్యక్తిగా మాత్రమే ఎదిగాడు తప్ప అన్నచాటు తమ్ముడిగానో లేదా పార్టీ పెట్టిన పదవుల బిక్షతోనో ఏనాడూ పదవులు అనుభవించిన చరిత్ర రాజగోపాల్ రెడ్డికి లేదు.. కాదు. మరి ఇలాంటి ప్రజా క్షేత్రంలో పలుమార్లు గెలిచిన ప్రజా నాయకులకు కాకుండా గత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకంతో పనికిమాలిన మార్గంలో ఒక్కసారి గెలిచి కులం కార్డుతో ఒకడు, అనుచరుడిగా ఒకడు, ముఖపరిచయం లేనివాడొకడు మంత్రి పదవులకు అర్హుడైనప్పుడు రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవికి ఎందుకు అర్హుడు కాదో కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పగలదా..! ప్రజా క్షేత్రంలో అనుభవం లేని వారికి పదవులు ఇస్తే ఆ మంత్రి పదవికి వన్నె తేవటం వదిలి ఏంచేయాలో దిక్కుతోచక, డూ డూ బసవన్నలుగా పదవికాలం వెళ్ళదియటం తప్ప మరేమన్నా చేయగలరా..!? అనేది ప్రజల వైపు నుండి విలువడుతున్న ప్రశ్నలు. అసలు ఎమ్మెల్యేగా కనీస అనుభవం లేనివారికి కులం కార్డుతో మంత్రి పదవి ఇచ్చినదానికంటే హీనమా..! అనే అంశంపై పార్టీ కులంకుశంగా అలోచించి నిర్ణయం తీసుకోవాలె తప్ప తప్పుడు ధోరణితో, తప్పుడు ఆలోచనతో ఒక ఉన్నతమైన అనుభవాలు ఉన్న నాయకున్ని పక్కన పెట్టటం పార్టీ స్వయం కృతాపరదమే తప్ప మరోటి కాదు. ఎందుకంటే ప్రతిపక్ష నాయకుడిగా రాజగోపాల్ రెడ్డి లాంటి నాయకుని పాత్ర గత పదేళ్లలో పలుమార్లు ప్రభుత్వానికి ముచ్చేమటలు పట్టించాడు. ముక్కు సూటిగా పదుల సంఖ్యలో వందల సార్లు అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ గళాన్ని వినిపించాడు. అనేకమంది ఎమ్మెల్యేలు అమ్ముడు పోయినా పార్టీవ్యక్తిగా తానునమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నాడు. బీజేపీ లోకి చేరేటప్పుడు సైతం పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి దమ్మున్న నాయకుడు అనిపించు కున్నాడే తప్ప మరోమారు అలోచించలేదు. ఓటమిని సైతం స్వీకరించాడే తప్ప వెన్ను చూపలేదు. మళ్ళీ కాంగ్రెస్ లోకి వచ్చినా తన సత్తా ప్రజల్లో చాటుకు న్నాడే తప్ప ఎవడికి మడుగులోత్తలేదు. ఈ ఒక్క ఉదాహరణ చాలదా మంత్రి పదవి అర్హతకి. కులం కార్డువాడాలంటే వందశాతం బరాబర్ వాడొచ్చు. పదవి కొనాలంటే ఆ దమ్ముసైతం రాజగోపాల్ రెడ్డికి లేదా..? కేవలం ప్రజా తీర్పుపై గెలిచి అర్హతకు తగ్గట్టుగానే అనుభవానికి తగ్గట్టుగానే పదవిని ఆశిస్తే పనికిమాలిన కారణాలు చెబుతూ అన్న, తమ్ముడు అంటూ పార్టీ విలువను దిగజార్చటం దేనికి సాంకేతమో నీచమైన కులరాజకీయలకంటే రోతగా అనిపిస్తుందని, ప్రజల విశ్వాసాన్ని కూడగట్టుకున్న నాయకులకు, అనుభవం కలిగిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తే ప్రజాక్షేత్రంలో సైతం పార్టీకి, నాయకులకు విలువలుంటాయని ఆలోచించవలసిన అదినాయకత్వం అనవసరపు కారణాలు చూపటం పార్టీని మరియు పార్టీని నమ్మిన వారిని కించపరచటమే తప్ప మరోటి కాదు అని గుర్తించాలి. లేని పక్షంలో తనగొయ్యి తానే తీసుకున్న చరిత్ర తిరగరాసుకున్న మరో పుటను లిఖిచుకోవటం తప్ప మరొకటి కాదని నా ప్రగాఢ విశ్వాసం.



మీ
**డాక్టర్ మురహరి బుద్దారం**
ఐఎన్టియుసి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు,
సీనియర్ జర్నలిస్ట్, హైకోర్టు అడ్వకేట్ 9441739988.

వెలుతురు

(మొదటి పేజీ తరువాయి..)

## మరింత అప్రమత్తంగా ఉండాలి

సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని సీఎం తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## నడుమంటి వరద నీళ్లు దాటుకుంటూ వెళ్లిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

కేంద్రంలోని పలు కాలనీలు వరద నీళ్లల్లో మునిగిపోవడంతో వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పర్యటించారు. మహాలక్ష్మి వాడ, తీర్పెల్లి, జి.ఎస్ ఎస్టేట్ తదితర కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే నడుమంటి నీళ్లలో నుండి నడుచుకుంటూ వెళ్లి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. అదేవిధంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్ గూడ, అంకొలి తంతోలి తదితర గ్రామాల్లోని వరద ప్రాంతాల్లో సైతం ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రాజుతో పాటు పలువురు బిజెపి పార్టీ నాయకులు ఉన్నారు నాయకులు విజయ్ రాము మహేందర్ సాయికిరణ్ రాకేష్ తదితరులున్నారు

## ఉద్యమకారులనుకనే వాళ్లకు వేలకోట్లు ఎక్కడివి?

ప్రముఖ కవి అందేశ్రీ రచించిన హసిత భాష్పాలు పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం కవులకు, పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ అని అన్నారు. ఉద్యమంలో ప్రజలకు స్ఫూర్తిగా గూడ అంజన్న, దాశరథి, కాళోజీ, అందెశ్రీ, గద్దర్, గోరెటి వెంకన్న లాంటి కవులు నిలిచారని గుర్తు చేశారు. తనపై తనకు సంపూర్ణ నమ్మకం కలిగించి, కార్యోన్ముకిన్ని చేసి యుద్ధ రంగానికి సిద్ధం చేసిన వ్యక్తి శ్రీకృష్ణుడు అని అన్నారు. తాను కొంచెం ఓపెన్‌గా మాట్లాడు తానని, ఎక్కువ టైమ్ రాజకీయ కార్యక్రమాలకు ఇస్తానని, ఎందుకుంటే అక్కడ తాము మాట్లాడేదే ఫైనల్ ఉంటుందని అన్నారు. కానీ ఈ పుస్తకావిష్కరణలకు రావాలంటే పదంపదం ప్రిపేర్ అయ్యి రావాలని అన్నారు. కింది స్థాయి నుంచి ఈ స్థాయికి వచ్చానని, ఇంత గొప్ప అవకాశాన్ని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఇచ్చారని అన్నారు. ఇలాంటి గొప్ప అవకాశాన్ని, తనకు వాళ్ల మీద ప్రయోగిస్తే తనకంటే మూర్ఖుడు మరోకరు ఉండరని అన్నారు. తాను కర్మసిద్ధాంతాన్ని నమ్ముతానని, వాళ్ల పాపాన వాళ్లేపోతారని భావిస్తానన్నారు. తన గెలుపుతో గిట్టని వాళ్లకు దుఃఖం వచ్చిందని, తాను సంతకం పెడుతుంటే వాళ్లకు గుండెల్లో రాసినట్టు అయ్యిందని అన్నారు. అందాల పోటీల్లప్పుడు 109 దేశాల సుందరీమణులతో జయ జయహే తెలంగాణ పాటను పాడించామని, వాళ్లను తెలంగాణ తల్లి ముందు మోకరించామని అన్నారు. కట్టడాలు ఎవరైనా కట్టొచ్చని, అందమైన భవనాలు అభివృద్ధి కాదని, పేదలకు సొంత ఇళ్లు ఇచ్చి ఆత్మగౌరవం నిలబెడుతున్నామని అన్నారు. ఒకనాడు సీఎంను చూడాలంటే గొప్ప సన్నివేశం. కానీ ఇప్పుడు ఎప్పుడైనా, ఎవరైనా కలవచ్చని అన్నారు. తాను జడ్పీటీసీ కాగానే కౌన్సిల్ వచ్చిందని, తర్వాత ఎమ్మెల్సీ అయ్యానని, తెలంగాణకి రెండో సీఎం అయ్యానని అన్నారు. 2040 వరకు క్రియాశీలక రాజకీయాల్లో ఉంటానని సీఎం అన్నారు. తనకు రాజకీయాల్లో శత్రువులెవరూ లేరన్నారు సీఎం రేవంత్ రెడ్డి. తాను శత్రువుగా చూడాలన్నా ఆ వ్యక్తికి అంతటి స్థాయి ఉండాలని చెప్పారు. వ్యక్తిగత పగకోసం తన పదవిని అడ్డం పెట్టుకుంటే తనకన్నా మూర్ఖుడు ఇంకొకరు ఉండరని చెప్పారు. శత్రువులకు తన గెలుపే అసలైన శిక్ష అని అన్నారు. తాను కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతానన్న సీఎం రేవంత్.. ఎవడి పాపాలకు వాడే బలైపోతారని చెప్పారు. .తనకు అన్ని చట్ట సభల్లో పనిచేసిన అనుభవం ఉందన్నారు. అద్దాల మేడలు అభివృద్ధి కాదని.. సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరినప్పుడే అసలైన విజయం అని అన్నారు. నిజమైన ఉద్యమకారులెవరూ ఉద్యమకారుడినని చెప్పుకోరని..సర్వం కోల్పోయినా లక్ష్యం వైపు వెళ్తారని చెప్పారు రేవంత్. ఉద్యమకారులని చెప్పుకునే వాళ్లకు అన్ని వేల కోట్లు- ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణతో పేగు బంధం,పేరు బంధం అన్ని తెంచుకున్నారని విమర్శించారు. దేశానికి నాయకత్వం వహించాలనే దురాశతో అన్నీ కోల్పోయారని అన్నారు.

## రజనీకి చంద్రబాబు, మోడీల అభినందనలు

షేర్ చేసిన రజనీ.. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.మీ మాటలు నా హృదయాన్ని తాకాయి. మీ అభినందనలు నాకు ఆనందాన్నిచ్చాయి. మీ సందేశం నా మనసుకు హత్తుకుంది. ఈ శుభాకాంక్షలు నాలో స్ఫూర్తి నింపాయి. మీ లాంటి వ్యక్తుల ప్రేమ, స్నేహంతో నేను సినిమా పరిశ్రమలో ఉత్తమంగా రాణించడానికి కృషిచేస్తాను అంటూ చంద్రబాబుకు రజనీకాంత్ థాంక్స్ చెప్పారు. ఆగస్టు 15 నాటికి సూపర్ స్టార్ ఇండస్ట్రీలో ప్రవేశించి 50 ఏళ్లు పూర్తయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న ఫొటోను పంచుకొని ఏపీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ తన సినిమాలతో ప్రేక్షకులను అలరించడమే కాకుండా సందేశాలు కూడా ఇస్తారని కొనియాడారు. సామాజిక సమస్యలపై కూడా పలు చిత్రాలు తీశారని.. అవి ఎంతోమందిని కదిలించాయని తెలిపారు. ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ కూడా రజనీకాంత్‌కు విషెస్ చెప్పారు. ఆయన పోషించిన వైవిధ్యమైన పాత్రలు ప్రేక్షకులపై ఎంతో ప్రభావం చూపాయన్నారు. ఇలాగే మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. మోదీకి సైతం రజనీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. తానెంతగానో గౌరవించే నాయకుడి నుంచి అభినందనలు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ పోస్టు పెట్టారు.

## పోలవరంను కూలవరం అనగలరా?

విమర్శిస్తున్నారు. కాంగ్రెస్, భాజపా నేతలకు పోలవరాన్ని కూలవరం అనే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు.జాతీయ హోదా ఇచ్చి మరీ.. సాక్షాత్తూ ఎన్డీఏ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం కాఫర్ డ్యామ్, రెండో సారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు 'పోలవరంను.. కూలవరం' అనే దమ్ము ధైర్యం ఉందా..? అని అడిగారు.తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..? అని ప్రశ్నించారు. ఏకంగా 10 అడుగుల వెడల్పు.. 7 నుంచి 8 అడుగుల లోతుకు కుంగిన పోలవరం కాఫర్ డ్యామ్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఏపీలో యుద్ధప్రాతిపదికన రిపేర్ చేస్తుంటే.. తెలంగాణలో మాత్రం 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డ బ్యారేజీ వద్ద తట్టెడు సిమెంట్‌కు దిక్కులేకపోవడానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి మూర్ఖత్వమే అని కేటీఆర్ మండిపడ్డారు. 2020లో పోలవరం డయాఫ్రం వాల్ రెండేండ్లకే కొట్టుకుపోయినా ఇప్పటికీ ఉలుకు లేదు, పలుకూ లేదు. మరోసారి ఏపీలో పోలవరం కాఫర్ డ్యామ్ గోదావరిపాలైనా, ఇటు- తెలంగాణలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది మరణించినా ఇప్పటికీ ఎన్డీఎస్ఏ అడ్రస్ లేదు. పంజాబ్‌నే తలదన్నే స్థాయిలో తెలంగాణలో వ్యవసాయ విప్లవాన్ని సృష్టించి, దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రైతును తీర్చిదిద్దిన కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సాగిస్తున్న మూకుమ్మడి కుట్రలను కాలరాస్తాం.. తెలంగాణకు జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. జై తెలంగాణ.. జై కాళేశ్వరం.. అని కేటీఆర్ నినదించారు.

## భరతమాత ముద్దుబిడ్డ వాజ్ పేయి

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 16:**
ప్రజాస్వామ్య ఫలాలను అట్టడుగునున్న పేద వాడి వరకు తీసుకెళ్లాలనే శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలను, సిద్ధాంతాలను తూ.చ. తప్పకుండా అమలు చేసిన గొప్ప నాయకుడు, మానవతావాది, భరతమాత ముద్దుబిడ్డ వాజ్ పేయి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. స్వార్థ ప్రయోజనాల కోసం చిల్లర రాజకీయాలు చేస్తూ ప్రభుత్వ విధానాలను గుడ్డిగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలున్న ఈరోజుల్లో... అందుకు భిన్నంగా ప్రతిపక్షమంటే ప్రజల పక్షమని నిరూపిస్తూ దేశ ప్రయోజనాల విషయంలో రాజకీయాలను పక్కనపెట్టి పాలక పక్షానికి సహకరించిన చరిత్ర వాజ్ పేయిదేనని పేర్కొన్నారు. భారత మాజీ ప్రధానమంత్రి, భారత రత్న అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా శనివారం రోజున కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో బీజేపీ నేతలతో కలిసి వాజ్ పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బండి సంజయ్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. "భారత దేశ వైభవాన్ని, విలువలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నా. పదవుల కోసం ఎంతటికైనా దిగజారే వ్యక్తులు, పార్టీలున్న ఈరోజుల్లో..... అందుకు భిన్నంగా నమ్మిన సిద్ధాంతం కోసం, విలువల కోసం కేంద్ర మంత్రి, ప్రధానమంత్రి వంటి అత్యున్నత పదవులనే త్రుణ ప్రాయంగా వదిలేసుకున్న మహా నాయకుడు వాజ్ పేయి"అని కొనియాడారు. 2 ఎంపీ సీట్లకే పరిమితమైన బీజేపీని అలుపెరగని పోరాటం చేసి ప్రభుత్వంలోకి తీసుకురావడంతోపాటు మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టిన నేత వాజ్ పేయి అని పేర్కొన్నారు.

"తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వాజ్ పేయి ప్రభుత్వం పార్లమెంట్ బలనిరూపణలో ఏఐడీఎంకే అధినేత జయలలిత మద్దతు ఉపసంహరించుకోవడంతో ఒకే ఒక్క ఓటు తక్కువై ప్రభుత్వాన్ని కోల్పోయారు. ఆనాడు ఇతర పార్టీల ఎంపీలు బీజేపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ..... అంతకుముందు దేశాన్ని నడిపిన పాలకులు ఎంపీలను కొనుగోలు చేసి ఐదేళ్లపాటు ప్రభుత్వాన్ని నడిపి ప్రజాస్వామ్య విలువలకు పాతరేసిన దాఖలాలున్నప్పటికీ.... నేను ప్రజల వద్దకే వెళతానే తప్ప ఇట్లాంటి నీతిమాలిన పనులు చేయబోనంటూ ఏకంగా అత్యున్నత ప్రధానమంత్రి పదవినే వదులుకుని తిరిగి ఎన్నికల్లోకి వెళ్లి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నిజాయితీపరుడు వాజ్ పేయి"అని శ్లాఘించారు."నిత్యం గాంధీ పేరు చెప్పుకుని రాజకీయ పబ్బం గడుపుకుంటూ ఆయన ఆశయాలను, ఆలోచనలను తుంగలో తొక్కే పార్టీలున్న ఈ రోజుల్లో గాంధీజీ కలలు కన్న రామ రాజ్యం... గ్రామ స్వరాజ్య స్థాపన కోసం నిరంతరం పరితపించి అమలు చేసిన మహనీయుడు వాజ్ పేయి. ఒకనాడు గ్రామాల నుండి పట్టణాలకు వెళ్లాలంటే రోడ్లు బాగోలేక నరక యాతన పడుతున్న ప్రజల బాధలను దూరం చేసేందుకు గ్రామీణ సడక్ యోజనతో దేశంలోని అన్ని మారుమూల గ్రామాలకు రోడ్లు వేసిన ఘనత వాజ్ పేయి గారిదే. స్వర్ణ చతుర్భుజీ పేరుతో 4 లేన్లు, 6 లేన్ల జాతీయ రహదారులను ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా మార్గాలను సులభతరం చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడు. ప్రపంచ దేశాలన్నీ భారత్ ను తెలివి తక్కువోళ్లు... పిరికివాళ్లని హేళన చేస్తున్న తరుణంలో ప్రపంచమే హడలెత్తేలా ప్రోక్రాన్ పరీక్షలు నిర్వహించి అణుబాంబును తయారు చేసి అగ్రదేశాలకు వణుకు పుట్టించిన ధీశాలి వాజ్ పేయి."అని కొనియాడారు.

వాజ్ పేయి ఆలోచనలకు అనుగుణంగా నడుస్తూ భారత్ ను విశ్వగురుగా తీర్చిదిద్దుతున్న నాయకుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని పేర్కొన్నారు. "ఆనాడు వాజ్ పేయి హయాంలో వీరోచిత కార్గిల్ పోరాటం చేస్తే మోదీ హయాంలో సర్జికల్ స్ట్రయిక్స్, ఆపరేషన్ సింధూర్ తో పాక్ వెన్నులో వణుకు పుట్టించారు. స్వర్ణ చతుర్భుజీతో జాతీయ రహదారుల విస్తరణకు వాజ్ పేయి నాంది పలికితే.. వాటిని పరిపూర్ణం చేసిన మహానేత మోదీ. గత పాలకుల హయాంలో లబ్దిదారులకు రూపాయి విడుదల చేస్తే అందులో 15 పైసలు మాత్రమే అందుతోందని, మిగిలిన పైసలు దళారుల చేతుల్లోకి వెళుతున్న సమయంలో జీరో బ్యాలెన్స్ తో కొట్ల పేదలకు బ్యాంకు అకౌంట్లను తెరిపించి సంక్షేమ ఫలాల నగదును దళారుల ప్రమేయం లేకుండా జమ చేస్తున్న గొప్ప నాయకుడు మోదీ"అని ప్రధానిని కొనియాడారు.

## వర్ష నష్టాలు జరక్కుండా చూడండి

- **కల్వర్టుల, కాజ్‌వేల వద్ద అప్రమత్తం**
- **ఆర్ అండ్ బి అధికారులకు సూచన**
- **అధికారులతో సమీక్షించిన మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్,ఆగస్టు16( వెలుతురు):**
తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. అధిక వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనల వివరాలపై ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా 454 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. 629 కిలో మీటర్లు రోడ్డు దెబ్బతిన్నట్లు- అధికారులు నివేదిక ఇచ్చినట్లు- చెప్పారు. రోడ్ల మరమ్మత్తులపై పనులు ప్రారంభించినట్లు- పేర్కొన్నారు. గత ప్రభుత్వం వేసిన నాణ్యతా రహిత రోడ్ల వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పాడ్డాయని ఆరోపించారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రోడ్ల డ్యామేజీపై





అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..భారీ వర్షాల కారణంగా 22 చోట్ల రోడ్లు తెగిపోతే వెంటనే 4 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేసినట్లు- మంత్రి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు. 171 చోట్లలో ఇంకా కాజ్ వే, కల్వర్టులు వద్ద వరద ప్రవాహం ఉన్నట్లు- పేర్కొన్నారు. 108 రాకపోకలకు ఇబ్బంది ఉన్న ప్రాంతాలను గుర్తించినట్లు- చెప్పారు. 71 చోట్ల క్లియర్ చేయగా.. మిగతా చోట్ల సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు- వివరించారు. వాగుల వెంట 58 కి.మీ రోడ్డు కోతకు గురైందని, అందులో 378 మీటర్లు రోడ్డును ప్రభుత్వం మూసివేసిందని తెలిపారు. మొత్తంగా 147 చోట్లలో కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు- వెల్లడించారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అవసరమైతే తప్ప రావొద్దని మంత్రి సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు కల్వర్టులు, లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల వద్ద ఇంజినీర్లు విధిగా తరచూ క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. అందుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్ శాఖల విభాగాలతో ఆర్ అండ్ బీ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజా రవాణాకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టులు వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. అధికారులు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

## కాళేశ్వర..మేడిగడ్డను కూల్చే కుట్రలు

- **కేసు నమోదయినా ఎందుకు పురోగతి లేదు**
- **సిబిఐ విచారణ జరిపిస్తే నిజాలు వెల్లడవుతాయి**
- **బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్**

**హైదరాబాద్,ఆగస్టు16( వెలుతురు):**
కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపయోగంగా పెట్టిందని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కావాలనే అక్కడ రిపేర్లు చేయకుండా, నీటిని ఎత్తిపోయకుండా పడావుపెట్టారని అన్నారు. మేడిగడ్డ ఆనకట్ట వద్ద శబ్దాలు వినిపించాయని ఏఈఈ రవికాంత్ ఫిర్యాదు చేశారని, అక్టోబర్ 2023, 21న సాయంత్రం 6.30 గంటలకు మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైందని గుర్తు చేశారు. అసాంఘిక శక్తులు ఉన్నాయని ఏఈఈ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు- చెప్పారు. అయినప్పటికీ.. ఈ కేసు విచారణపై ఎలాంటి పురోగతి లేదన్నారు. పేలుళ్లు జరిగిన ప్రాంతాన్ని సీజ్ చేసి, కారణాలపై అన్వేషణ జరగాలి కదా?మొత్తం వ్యవహారంపై సీబీఐ లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కుట్ర వెనుక కాంగ్రెస్, బీజేపీ ఉన్నాయని ఆర్ఎస్పీ ఆరోపించారు. తెంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం పట్ల సంచలన ఆధారాలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బయటపెట్టారు. 2023వ సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన సాయంత్రం 6:20 గంటలకు, మేడిగడ్డ పిల్లర్ల వద్ద భారీ శబ్ధాలు వచ్చాయని మేడిగడ్డ అసిస్టెంట్ ఇంజనీర్ రవికాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు 2023 సంవత్సరం అక్టోబర్ 22వ తేదీన మహదేవ్‌పూర్ పోలీస్



స్టేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఆ ఎఫ్ఐఆర్ పట్ల చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆర్ఎస్పీ నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారు. ప్రాజెక్టు పిల్లర్‌కు పగుళ్లు రావు.. క్రస్ట్ గేట్లకు వస్తే రావొచ్చేమో. ఇంటి నిర్మాణానికి సంబంధించిన పిల్లర్లకు కూడా పగుళ్లు రావు.. ఉష్ణోగ్రత తేడాతో గోడలకు పగుళ్లు వస్తాయి కానీ కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక్కటే 20వ నెంబర్ పిల్లర్‌కి క్రాక్ వచ్చిందంటే, కచ్చితంగా బ్లాస్ట్ జరిగిందనే అనుమానాలు ఉన్నాయని ఆర్ఎస్పీ అనుమానం వ్యక్తం చేశారు. అసలు ఏమాత్రం వరద లేని సమయంలో మేడిగడ్డ బ్యారేజీ ఎలా కుంగిపోయింది.. అది కూడా ఒక్క పిల్లరే ఎలా కుంగిపోతుంది. 2022లో రికార్డు స్థాయిలో వరదలు వచ్చినా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు తట్టు-కున్నాయి. మేడిగడ్డలో ఒక్క పిల్లర్ మాత్రమే ఎందుకు కుంగిపోయింది. కిషన్ రెడ్డి లేఖ రాయగానే ఎన్‌డీఎస్ఏ వచ్చింది. ఉత్తరాఖండ్‌లో మొత్తం డ్యామ్ కొట్టు-కునిపోతే ఎందుకు ఎన్డీఎస్ఏ అక్కడికు వెళ్ళలేదు. మేడిగడ్డ వద్ద పేలుళ్ల శబ్దాలపై ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడటంలేదు. మహదేవ్‌పూర్ పోలీసులు వెంటనే విచారణ చేసి ఉండాలి. అసాంఘిక శక్తులు రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇంకా ఎవరైనా అనేది తేల్చాలి. ఈ ముగ్గురి మొబైల్ ఫోన్స్ డేటా చెక్ చేస్తే వెంటనే దొరికేవాళ్ళు . భూపాలపల్లి పోలీసులు అప్పుడు వెంటనే పిల్లర్ల శాంపిల్స్, భూమి శాంపిల్, అక్కడ ఉండే మీటర్ రీడింగ్స్, సిస్మిక్ డేటా, కాల్ డీ-టె-యిల్స్ తీసుకొని ఉండాల్సింది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు. పిల్లర్లకు ఎక్కడా క్రాక్ రాదని ఇంజనీరింగ్ నిపుణులు చెప్తున్నారు. దీని వెనుక రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఉన్నారా లేదా అనేది సిట్ ఏర్పాటు- చేసి తేల్చాలి. అసలు అక్కడ చిన్నస్థాయిలో ఏమైనా భూకంపాలు వచ్చాయా లేదా అనేది తేల్చాలి. పేలుళ్ల కోణంలో ఎందుకు విచారణ జరగలేదు. పేలుళ్లపై ఇప్పటివరకు ఎవరి స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు.

## రేవంత్ తీరుతో నిర్మాణరంగం కుదేలు

- **కెసిఆర్ వైభవం కల్పిస్తే..రేవంత్ దెబ్బతీసారు**
- **బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ విమర్శలు**

**హైదరాబాద్,ఆగస్టు16( వెలుతురు):**
తెలంగాణలో నిర్మాణ రంగం కుదేలవటానికి ముఖ్య కారణం రేవంత్ రెడ్డి అని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. బ్రాండ్ హైదరాబాద్ క్రియేట్ చేసిందే కేసీఆర్, కేటీ-ఆర్ అని తెలిపారు. నిర్మాణరంగానికి ముఖ్యమంత్రి నమ్మకం కల్పించలేకపోయారని పేర్కొన్నారు. బాధ్యత లేని వ్యక్తి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుంటే ఎలా ఉంటు-ందో చూస్తున్నామని విమర్శించారు. ఈ మేరకు సీఎం రేవంత్ సర్కార్‌పై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గోల్కొండలో, క్రెడాయక్ కార్యక్రమంలో సీఎం



రేవంత్ సొల్లు పురాణం చెప్పారని విమర్శించారు. రేవంత్ రెడ్డికి విషం ఎక్కువ.. విషయం తక్కువ.. అని ఎద్దేవా చేశారు. మధ్యతరగతి వాడినని చెప్పుకునే రేవంత్ రెడ్డి.. తన బూట్లు-, బెల్ట్, టీ- షర్టులు ఎంత విలువనో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇతర వ్యాపారాల మీద ఉన్న యావ రేవంత్‌కు ఇంగ్లీష్ నేర్చుకోవటంలో లేదన్నారు. కుక్కతోక వంకర మాదిరి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులను వాడుకుని రేవంత్.. బీఆర్ఎస్ నేతలను హింసిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డికి విజన్ లేదు.. విజ్ఞం లేదని శ్రవణ్ ఆరోపించారు. ఎంత సేపు కేసీఆర్‌ను తిట్టడం, చంద్రబాబును పొగడటం తప్ప ఆయనకు ఏదీ చేత కాదని విమర్శించారు. హైదరాబాద్ అనేది రెవెన్యూ ఇంజిన్ అని పేర్కొన్నారు. నిర్మాణ రంగం బాగుంటేనే అన్ని బాగుంటాయని సూచించారు. కేసీఆర్, కేటీ-ఆర్‌ల చొరవతో హైదరాబాద్ పెట్టు-బడులకు గమ్యస్థానంగా మారిందన్నారు. హైదరాబాద్ ఇమేజ్ రేవంత్ పాలనలో డ్యామేజీ అయ్యిందని అసహనం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీలో భవన నిర్మాణ అనుమతులు తగ్గిపోయాయని పేర్కొన్నారు. హెచ్ఎండీఏలో కార్యకలాపాలు పడకేశాయని తెలిపారు. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీని అడ్డం పెట్టుకుని రేవంత్ బిల్డర్లను బెదిరిస్తున్నారని దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు.

# నక్సల్స్ తో చర్చలు జరిపి మీరేం సాధించారు

**ఆపరేషన్ కగార్ ఎందుకు ఎత్తివేయాలి**

**తూపాకీపట్టి అమాయకులను చంపుతుంటే చూస్తూ ఊర్కోవాలా?**

**నక్సల్స్ తూటాలకు 50 వేల మంది బలి**

**50 ఏళ్లలో భారీ విధ్వంసం జరిగింది**

**ప్రజాస్వామ్య విలువలను ధ్వంసం చేశారు**

**నక్సల్స్ కు మద్దతిస్తున్న వారికి విద్యా కమిషన్ లో చోటు కల్పిస్తారా?**

**ఎంతో మందిని నక్సల్స్ చంపినప్పుడు సామాజిక కోణం గుర్తుకురాలేదా?**

**జాతీయ జెండాను ఎగరనీయని నక్సలైట్లు ఏ దేశభక్తులు?**

**బాక్సైట్ తవ్వకాల కోసమే 'ఆపరేషన్ కగార్' నిర్వహిస్తున్నారని ప్రచారం చేయడం దుర్మార్గం**

**స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నేటి వరకు గనుల తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి కదా?**

**బ్యాలెట్, బుల్లెట్ ఒకే ఒరలో ఉండలేవు**

**నక్సలైట్ల ఏరివేతను కొనసాగిస్తాం**

**2026 మార్చినాటికి నక్సలిజాన్ని నిర్మూలించి తీరుతాం**

**నక్సల్స్ ముక్త్ భారత్ మా ధ్యేయం**

**కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్**

**కరీంనగర్ లో 'నక్సల్స్ నరమేధం-మేధోమథనం' చర్చలో పాల్గొన్న కేంద్ర మంత్రి**

**నక్సల్స్ చేతిలో బలైన ఏబీవీపీ విద్యార్థులకు నివాళి అర్పించిన బండి సంజయ్**





కరీంనగర్ వెలుతురు ఆగస్టు 16:

పేదరికం ఉన్నంత కాలం నక్సలిజం ఉంటుందని, ఆపరేషన్ కగార్ ను ఆపి నక్సలైట్లతో చర్చలు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నక్సలైట్లతో గతంలో చర్చలు జరిపిన కాంగ్రెస్ ఏం సాధించిందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నంత కాలం నక్సలైట్ల నిషేధం విధించిన కేసీఆర్ అధికారం పోగానే చర్చలంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. నక్సలైట్ల సమస్య సామాజిక కోణంగా చూడాలని మాట్లాడుతున్న పౌర హక్కులు, మానవ హక్కుల సంఘం నేతలు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. నక్సలైట్ల చేతిలో వేలాది మంది అమాయక ప్రజలు చనిపోయినప్పుడు సామాజిక కోణం గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. నక్సల్స్ దురాగతాలవల్ల దాదాపు 50 వేల మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 9 వేల మంది పోలీసులు నక్సల్స్ తూటాలకు బలయ్యారని వాపోయారు. ఆపరేషన్ కగార్ ను ఆపే ప్రసక్తే లేదని, నక్సలైట్లను ఏరిపారేసే కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించి 'నక్సల్ ముక్త్ భారత్' గా మార్చి తీరుతామని ఉద్ఘాటించారు. రాజకీయాల్లోకి రాకుండా ఏబీవీపీలో ఫుల్ టైమర్ గా ఉంటూ సేవలందించాలని గతంలో భావించానని, విద్యార్థి సమస్యలపై పోరాడుతున్న తనపై అనేక కేసులుండటంతోనే రాజకీయాల్లోకి వచ్చి పోరాటాలు చేయాల్సి వచ్చిందన్నారు. కరీంనగర్ లో శనివారం రోజున సాయంత్రం ఏబీవీపీ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు 'నక్సల్స్ నరమేధం-మేధోమథనం' చర్చలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏబీవీపీ ప్రాంత ప్రముఖ్ మాదాసి బాబూరావు, విభాగ్ ఇంఛార్జ్ అన్నల్ దాస్ మురళి, సంయుక్త కార్యదర్శి ముత్యాల రాకేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నక్సల్స్ చేతిలో బలైన ఏబీవీపీ విద్యార్థులకు నివాళి అర్పించిన బండి సంజయ్ అనంతరం చేసిన ప్రసంగం వివరాలిలా ఉన్నాయి.

2026 మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలించి తీరుతామని ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో హెూంమంత్రి అమిత్ షా ప్రకటించి "ఆపరేషన్ కగార్" పేరుతో ఆ దిశగా యుద్ద ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో నక్సలిజం సామాజిక సమస్య. పేదరికం ఉన్నంత కాలం నక్సలిజం ఉంటుందని, నక్సల్స్ తో చర్చలు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నరు. ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని, చర్చలే పరిష్కారమని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ చెబుతున్నడు. ఈ నేపథ్యంలో 'నక్సల్స్ నరమేధం..మేధో మథనం' పేరుతో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చర్చా కార్యక్రమం నిర్వహించడం అభినందించదగ్గ విషయం.

యూపీఏ హయాంలో 200 జిల్లాలకు విస్తరించిన నక్సలిజం.. మోదీ హయాంలో 12 జిల్లాలకే పరిమితమైంది. రాబోయే మార్చి నాటికి ఆయా జిల్లాల్లోనూ నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించి తీరుతాం. నక్సలిజం ఆవిర్భించినప్పటి నుండి నేటి వరకు దాదాపు 50 వేల మందిని నక్సల్స్ పొట్టన పెట్టుకున్నారు. దాదాపు 9 వేల మంది పోలీసులు నక్సల్స్ తూటాలకు బలయ్యారు. భారీ ఎత్తున మౌలిక వసతుల విధ్వంసం జరిగింది. ఆర్థిక కార్యకలాపాలకు అనేక అడ్డంకులు ఏర్పడినయ్. అభివృద్ధి కుంటుపడింది. నక్సలిజం నరమేధంతో ప్రజాస్వామ్య విలువలపట్ల ప్రజలకు విశ్వాసం సన్నగిల్లింది. విద్య, ఆరోగ్యం, టెలికం, రవాణా రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పేద ప్రజల కోసం పోరాడుతున్నామని తుపాకీ పట్టిన నక్సలైట్లవల్ల ఆ పేదలకే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందకుండా చేశారు. పంద్రాగస్టునాడు జాతీయ పతాకాన్ని కూడా ఎగరనీయని నక్సలైట్లు ఈ దేశ భక్తులు? దీనిని దృష్టిలో ఉంచుకునే నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నక్సలిజం నిర్మూలనకు కంకణం కట్టుకుంది. 2015లో మూడు దశల వ్యూహం(భద్రత , అభివృద్ధి (, హక్కులు , భాగస్వామ్యం (Rights & Participation) పేరుతో నేషనల్ పాలసీ అండ్ యాక్షన్ ప్లాన్ (National Policy and Action Plan) ను రూపొందించి అమలు చేస్తోంది. వీటితోపాటు ప్రత్యేక పథకాలను అమలు చేస్తోంది. రాష్ట్రాలకు భద్రతా వ్యయానికి అవసరమైన నిధులిస్తోంది. మౌలిక వసతులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తోంది. భద్రతా బలగాలు, ప్రజల మధ్య పరస్పరం నమ్మకం పెంపొందిస్తోంది.దేశం కోసం, నక్సలిజానికి వ్యతిరేకంగా ఏబీవీపీ చేసిన పోరాటాలు అసామాన్యం. ఎంతో మంది బలిదానం చేశారు. దేశం కోసమే తప్ప ఏనాడూ స్వలాభం కోసం పనిచేయలేదు చంపుతామని నక్సలైట్లు వార్నింగ్ ఇచ్చినా వెరవకుండా జాతీయవాదం కోసం, విద్యారంగ సమస్యలపై పోరాడి బలిదానమయ్యారు. నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన ఏబీవీపీ త్యాగాలు వెలకట్టలేనివి.ఛత్తీస్ ఘడ్ లో నక్సలైట్లు 'జనతన సర్కార్' పేరుతో తుపాకులు పట్టి అమాయక ప్రజలను కాల్చి చంపారు. చదువుకుంటామంటే స్కూల్స్ కూడా ఓపెన్ చేయనీయలేదు. ప్రశ్నిస్తే కాల్చేసి చంపేశారు. పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పిన నక్సలైట్లు అక్కడ సాధించిన అభివృద్ధి ఏమిటి? నక్సలైట్ల మూలంగానే దేశంలో ఛత్తీష్ ఘడ్ అత్యంత పేదరికంతో బాధపడుతోంది.

ఆశ్చర్యమేందంటే నక్సలైట్ల ఆగడాలు దారుణంగా ఉన్నా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, కేసీఆర్ వంటి వారు మాత్రం పేదరికం ఉన్నంత కాలం నక్సలిజం ఉంటుందని, వాళ్లతో చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్ నిలిపేయాలని మాట్లాడుతున్నరు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే నక్సలైట్లు ఉన్న చోటే అత్యధికంగా పేదరికం ఎందుకు ప్రబలింది? నిజం చెప్పాలంటే నక్సలైట్లు ఉన్నచోటే పేదరికం, హింస ఎక్కువైంది. అందుకే నక్సల్స్ నిర్మూలనే లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగుతున్నం. నక్సలైట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చర్చలు జరిపింది కదా? ఏం సాధించారు? దశాబ్దాల తరబడి చర్చలు జరిపినా ఏం సాధించారు? తూపాకీని టేబుల్ పై పెట్టి చర్చలు చేస్తే న్యాయం జరుగుతుందా? నక్సలైట్ల మీద అంత ప్రేమ ఉంటే రాష్ట్రంలో నక్సలైట్లపై విధించిన నిషేధాన్ని ఎత్తేయమనండి. 10 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఈ మాటలెందుకు గుర్తుకురాలే. ఆయనెందుకు చర్చలు జరపలేదు? నక్సల్స్ పై నిషేధం ఎందుకు విధించారు. సిగ్గుండాలే ఆ మాటలనడానికి? అర్బన్ నక్సల్స్ పేరుతో నిషేధం ఉన్న సంస్థలకు అనుకూలంగా మాట్లాడుతుంటే.. వాళ్లను విద్యా కమిషన్ లో సభ్యులుగా నియమిస్తే సమాజానికి ఏం సందేశం పంపుతున్నారు? నక్సలిజం సామాజిక సమస్యగా చూడాలంటూ మానవ హక్కుల, పౌర హక్కుల సంఘం నాయకులు మాట్లాడటం ఆశ్చర్యమేస్తోంది. మావోయిస్టుల చేతిలో తుపాకులున్నాయి. గిరిజనులను, అమాయకులను కాల్చి చంపుతున్నారు. బాంబులు పెట్టి పోలీసులను చంపుతున్నారు. తుపాకులు చేతపట్టి కాల్చి చంపడాన్ని సామాజిక కోణంతో చూడాలనడం ఏం పద్దతి. బాంబులు (క్లైమోర్ మైన్స్) అమర్చి పోలీసులను తునాతునలు చేసి చంపుతుంటే సామాజిక కోణంతో చూడాలా? మహాముత్తారంలో ఎస్ఐ భార్య శ్రీమంతం చేసుకునే సమయంలో బాంబులు పెట్టి నక్సల్స్ ఆ ఎస్ఐని, కానిస్టేబుల్ ను చంపేస్తే సామాజిక కోణం గుర్తుకురాలేదా? దూరదర్శన్ జర్నలిస్టును, బీజేపీ నాయకులు సామ జగన్మోహన్ రెడ్డి, మధుసూదన్ గౌడ్, రామన్నగోపన్నలను చంపినప్పుడు సామాజిక కోణం గుర్తుకురాలేదా? గిరిజనులను, అమాయక ప్రజలను ఇన్ ఫార్మర్ల పేరుతో కాల్చి చంపుతుంటే సామాజిక కోణం గుర్తుకురాలేదా? అంతెందుకు మీ కాంగ్రెస్ నాయకులను ఎంతో మంది చంపేశారు. శ్రీపాదరావు, చిట్టెం నర్సిరెడ్డి, రాగ్యానాయక్ వంటి అజాత శత్రువులను కూడా నక్సల్స్ ను కూడా నిర్దాక్షిణ్యం చంపేశారు కదా... అప్పుడు సామాజిక కోణం గుర్తుకురాలేదా? ఇదేం ద్వంద్వ నీతి? తుపాకీ వీడితేనే సామాజిక కోణమైనా, చర్చలైనా, పరిష్కారాలైనా చూపేది. బాక్సైట్ తవ్వకం కోసమే ఛత్తీష్ ఘడ్ లో నక్సలైట్లను చంపుతున్నారని అర్బన్ నక్సలైట్లు కొందరు ఈ మధ్య విపరీతమైన దుష్ప్రచారం చేస్తున్నారు. వాళ్లను నేనొక్కడే అడుగుతున్నా గనుల తవ్వకాలు 1947 నుండి జరుగుతున్నాయి కదా? నక్సలిజం తీవ్రంగా ఉన్న సమయంలో కూడా తెలంగాణ, ఛత్తీష్ ఘడ్ ప్రాంతాల్లో గనుల తవ్వకాలు జరిగాయి కదా? బాక్సైట్ సహా గనులు జాతీయ సంపద. ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం గనుల తవ్వకాలు కొనసాగుతూనే ఉంటాయి. భవిష్యత్తులోనూ కొనసాగుతాయి. దానికి, నక్సల్స్ నిర్మూలనకు సంబంధమేముంది? మేం బ్యాలెట్ తోనే సమాధానం చెప్పాలంటున్నం.. వాళ్లు మాత్రం బుల్లెట్ తో జవాబిస్తమంటున్నరు. ప్రజాస్వామ్యమనే ఒరలో బ్యాలెట్, బుల్లెట్ ఒకేచోట ఇమడలేవు? తుపాకీ వీడితేనే చర్చలైనా, పరిష్కారాలైనా చూపేది. ప్రజాస్వామ్యంలో తుపాకీ ఒక్కరే పట్టాలి. అది పోలీసోడే కావాలి. ఆ పోలీసోడు పట్టిన తుపాకీ ప్రజలకు రక్షణ కవచం కావాలి. అంతే తప్ప ఎవరు పడితే వాళ్లు తుపాకీ పట్టి మనుషులను చంపుతామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ఏరిపారేసి తీరుతాం. మోదీ, అమిత్ షా నాయకత్వంలో వచ్చే మార్చి నాటికి నక్సలిజాన్ని అంతం చేస్తాం. 'నక్సల్స్ ముక్త్ భారత్' ను ఆవిష్కరించి తీరుతాం.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

**- సమీక్షా సమావేశంలో మంత్రులు పొన్నం, తుమ్మల**



**హైదరాబాద్,ఆగస్టు16( వెలుతురు):**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, అందుకు తగిన విధంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అభ్యర్థి ముఖ్యం కాదని, అది పార్టీ చూసుకుంటుందని అన్నారు. మనమంతా ఐక్యంగా పోరాడి కాంగ్రెస్ సత్తా చాటాలని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇన్‌ఛార్జ్‌లు, ముఖ్య నేతలతో మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఎర్రగడ్డ డివిజన్‌లో నేతలంతా ఐక్యంగా పని చేయాలని, అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్ బూత్ కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు- చేసుకోవాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బూత్‌ల వారీగా డివిజన్‌లో ఉన్న 46 బూత్‌ల పరిధిలో సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే అది రాష్ట్ర అభివృద్ధికి సంకేతం అవుతుందన్నారు. తామంతా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని మంత్రులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత అజారుద్దీన్ సహా స్థానిక నేతలు పాల్గొన్నారు.

# రాహుల్ విమర్శలకు స్పందించనున్న ఇసి

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించే ఛాన్స్**





**న్యూఢిల్లీ,ఆగస్ట్16( వెలుతురు):**

రాహుల్ విమర్శలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధం అవుతోంది. కర్ణాటక, బిహార్ సహా దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష నేతలు ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విమర్శలకు చెక్ పెట్టేందుకు ఈసీ సిద్ధమైనట్లు- తెలుస్తోంది. ఓట్ల చోరీ ఆరోపణల వేళ.. ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్లు- సమాచారం. బిహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటు- అధికార యాత్ర'ను ప్రారంభించనున్న రోజే ఈ సమావేశం ఏర్పాటుకు ముందుకు రావడం గమనార్హం. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే సమయంలో తప్ప.. ఇతర అంశాలపై ఎన్నికల సంఘం అధికారికంగా విలేకరుల సమావేశం నిర్వహించడం చాలా అరుదు. ఆదివారం నిర్వహించనున్న మీడియా సమావేశం వెనుక అసలు కారణాన్ని వెల్లడించనప్పటికీ.. కొంతకాలంగా ఈసీపై వెల్లువెత్తుతున్న ఆరోపణలకు సంబంధించినదని అధికారులు తెలిపారు. ప్రతిపక్షాలు 'ఓటు- చోరీ' అనే పదాన్ని పదే పదే వినియోగించడాన్ని ఈసీ ఇప్పటికే తప్పుపట్టింది. తప్పుడు కథనాలకు కారణమయ్యే ప్రచారాన్ని చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది.బిహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ, ఓట్ల చోరీపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్లు- చోరీకి గురయ్యాయని రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించారు. కర్ణాటకలోని ఒక్క మహాదేవపుర నియోజకవర్గంలోనే లక్ష ఓట్ల చోరీ జరిగిందన్నారు. ఈ ఆరోపణలకు లిఖితపూర్వంగా డిక్లరేషన్ ఇవ్వాలని ఎన్నికల సంఘం కోరింది. లేనిపక్షంలో దేశానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ పరిణామాల నడుమే కీలక సమావేశానికి సిద్ధమైనట్లు- తెలుస్తోంది.



# సంపాదకీయం.. రక్తి కట్టని నేతల రాజకీయ డ్రామాలు !




ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడివడ్డాక లెక్కలు తీస్తే రెండు రాష్ట్రాల్లోనూ అప్పులు విపరీతంగా పెరిగాయి. ఒకరిపై ఒకరు బురదజల్లుకుంటున్నారే తప్ప..సమస్య గురించి మాట్లాడడం లేదు. అప్పులు తీర్చే విధమేమిటో చెప్పడం లేదు వేలకోట్లు వడ్డీలకు చెల్లిస్తున్నారు తప్ప, దుబారా అరికట్టే ప్రయత్నం చేయడం లేదు. దుబారా నేతల జీతాలు, విమానాలు, హెలికాప్టరల్ ఖర్చు కింద ఉంది. అలాగే ఉచిత పథకాల కిందా పద్దు ఉంది. ఇవన్నీ అరికట్టకుండా ఐదేళ్లు పాలించినా అప్పులుపెరుగుతాయే తప్ప తగ్గవని గుర్తించాలి. ప్రజలు కూడా ఉచితాలకు అలవాటు పడితే మనమీదే భారం పడుతుందని గమనించాలి. ఇకపోతే ఎపిలో చంద్రబాబు అమరావతి, పి-4 అంటూ పరుగులు తీస్తున్నారు. అమరావతిలో ఉన్న భూమి చాలదన్నట్లు మరో 45 వేల ఎకరాలకు టెండర్ పెట్టారు. జగన్‌ను విమర్శిస్తూ...మరిన్ని అప్పులు చేసేస్తున్నారు. వడ్డీల భారం ప్రజలకు తప్పడం లేదు. గమ్మత్తు ఏంటంటే రెండు రాష్ట్రాల్లో కూడా ఇదే పద్ధతి కొనసాగుతోంది. అప్పులు తేవడం, వడ్డీలు కట్టడం ఇదే పాలనగా సాగుతోంది. సకాలంలో జీతాలు చెల్లించడం కూడా ఘనకార్యంగా చెప్పుకుంటున్నారు. మరోవైపు రాజకీయంగా ఎదురుదాడితో నిరంతరం విమర్శలకు పదను పెడుతున్నారు. ఎపిలో జగన్‌ను విమర్శించడంతోనే టిడిపి నేతల కాలం గడిచిపోతోంది. పెన్షన్లు పెంచాం, స్త్రీశక్తి పథకం అమలు చేశాం, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసాం అన్న నినాదం మార్మోగుతోంది. పులివెందుల విజయంతో బ్రహ్మాండం ద్దలు అయినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ తమపై కేసులు పెడతామని బెదిరించారని సింగపూర్ ప్రభుత్వ నేతలు తన పర్యటన సందర్భంలో చెప్పినట్టు చంద్రబాబు నాయుడు మంత్రివర్గ సమావేశంలో వివరించారని సమాచారం. జగన్‌ను రాజకీయంగా అణగదొక్కితేనే టిడిపి నిలుస్తుంది. అందుకే పులివెందులలో నానా డ్రామాలు ఆడారు. జగన్ అధికారంలో ఉండగా అంతకుమించి అన్నట్లుగా వ్యవహరించారు. ఇప్పుడు టిడిపికి సమయం వచ్చింది. ఈ క్రమంలో సింగపూర్ పర్యటన తరవాత తాను వారిని బాబు దువ్వి, క్షమాపణలు కూడా చెప్పానన్న రీతిలో చంద్రబాబు వివరణ ఇచ్చుకున్నారు. వారు మళ్లీ అమరావతికి రావడానికి విముఖంగా వున్నారని, ఆఖరుకు పెట్టుబడిదారుల సమావేశానికి రావడానికి కూడా బలవంతంగా ఒప్పించానని కూడా చంద్రబాబు చెప్పుకొచ్చారు. అయితే జగన్‌పై తాము కేసులు పెడతామని చెప్పినట్టు- ఆయన సింగపూర్‌లో వుండగానే టిడిపి అధికారిక ట్విటర్‌లో పేర్కొన్నారు. ఇంతకూ ఎవరి మీద ఎవరు కేసులు పెడతామన్నారనేది త్వరలో తేలనుంది. అయితే జగన్ వర్సెస్ కూటమి అన్నట్లుగా ఎపి రాజకీయాలు సాగుతున్నాయి. చెల్లి షర్మిల కూడా సమయం చిక్కినప్పుడల్లా అన్న జగన్‌పై చిర్రున లేస్తున్నారు. మొత్తంగా జగన్‌కుకాలం కలసి రావడం లేదు. ఇదిలావుంటే ఇక తెలంగాణలో బిసి రిజర్వేషన్ల రాజకీయం నడుస్తోంది. స్థానిక ఎన్నికలు ముగిసే వరకు ఇదే నడుస్తుంది. తెలంగాణ రాజకీయాల్లో ఒక విచిత్రం ఏమంటే కీలకమైన మూడు పార్టీలూ మిగిలిన రెండు పార్టీలూ కుమ్మక్కు అయ్యాయని పరస్పరం ఆరోపించుకుంటున్నాయి. బిసి బిల్లు గట్టెక్కక పోవడానికి బిఆర్ఎస్, బిజెపిలు కుమ్మక్కయ్యాయని కాంగ్రెస్ ఆరోపిస్తుంది. కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యిందని బిజెపి ఆరోపిస్తోంది. కాంగ్రెస్, బిజెపి కుమ్మక్క య్యిందని బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. మొత్తంగా తమాషా రాజకీయాలు నడిపిస్తున్నారు. బిజెపి, బిఆర్ఎస్ ఒకటేనని కాంగ్రెస్ అంటుంటే...కాంగ్రెస్ బిజెపితో కుమ్మక్కయిందని బిఆర్ఎస్ తిట్టిపోస్తుంటుంది. నేనేం తక్కువ అన్నట్టు కాంగ్రెస్, బిఆర్ఎస్ 'మ్యాచ్ ఫిక్సింగ్' అంటుంటుంది బిజెపి. మొత్తంగా రాజకీయంగా మైలేజీ కోసం మూడు రాజకీయ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. బిసి రిజర్వేషన్ లెక్కలు తేలేలా లేవు. స్థానిక ఎన్నికలకు కేవలం పార్టీపరంగా రిజర్వేషన్లను అమలు చేసుకోక తప్పదు. ఇదిలావుంటే పానకంలో పుడకలా తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రేవంత్‌పై బాహాటంగా తిరుగుబాటు ప్రకటించారు. మునుగోడే ముఖ్యం అంటూనే తన మంత్రి పదవి కోరికనుపదేపదే వల్లె వేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇస్తానని మాట తప్పారని ఆరోపిస్తున్నారు. వచ్చే పదేళ్లు నేనే ముఖ్యమంత్రిగా వుంటానని రేవంత్ చెప్పడంలో రాజకీయంగా దాడి ప్రారంభంచారు. రాజగోపాల్ గతంలో బిజెపిలో చేరి, మునుగోడులో చతికిల పడి, మళ్లీ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్‌లో రాడానికి మంత్రి పదవిని డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు. ఇప్పుడు మంత్రి పదవి లేకుంటే ఆయన రాజకీయ మనుగడ కష్టంగా మారనుందన్న రీతిలో మాట్లాడుతున్నారు. అయితే మంత్రి పదవి అన్నది రాహుల్ పెట్టే భిక్ష. ఆయన ఒకే చేస్తేనే ఇక్కడ పదవి వస్తుంది. ఇది జగమెరిగిన సత్యం. రాజగోపాల్ ఏదయినా రాహుల్‌తో తేల్చుకోవాలి. కాకా పట్టాల్సింది అక్కడే. ఇక తెలంగాణ రాజకీయాల్లో మరో తమాషా ఏమంటే బిజెపిలో కేంద్రమంత్రులు బండి సంజరు, కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌లు మూడు శిబిరాలైతే బిఆర్ఎస్‌లో కెసిఆర్ గాక కెటిఆర్, కవిత, హరీశ్‌ల మధ్య ప్రత్యక్ష పోటీనే నడుస్తున్నది. తమ పార్టీని బిజెపిలో కలిపేందుకు కొన్ని దయ్యాలు పని చేస్తున్నాయని కవిత అంటుంటే, ఆమె వెనక అదృశ్య శక్తులు చేరి ఇలా మాట్లాడిస్తున్నాయని విధేయ నేతల ఆరోపణ. కాంగ్రెస్‌లో సరే ఎలాగూ వేర్వేరు నేతలు పోటీ పడుతూనే వుంటారు. ఈ రాజకీయ మాయాజాలంలో ఎవరు ఏమిటో ప్రజలకు బాగా తెలుసు. వారు దగ్గరనుంచి అన్నీ గమనిస్తున్నారని ఆయా పార్టీల నేతలు గుర్తించాలి. తమ డ్రామాలను ప్రజలు గుర్తిస్తున్నాని కూడా గమనించాలి. ఇలాగే రాజకీయ డ్రామాలు ఆడితే ఏదో ఒకరోజు ఓప్పుడో ఒకప్పుడు వారు తమ అక్కసు వెళ్లగక్కగ తప్పదు.

# బహుజనుల ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారికి 375 వ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు

**సర్వాయి పాపన్న గౌడ్ వారసులుగా ఆయన ఆశయాలను, స్ఫూర్తిని తీసుకొని భవిష్యత్ తరాలకు అందించాలి**

**హైదరాబాద్ నడిబొడ్డున సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిలువెత్తు విగ్రహానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో శంకుస్థాపన**

**సర్వాయి పేట కోట ,పాపన్న తవ్వించిన హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును,ఆయన నిర్మించిన కోటలు పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం**

**పాపన్న గౌడ్ ను స్ఫూర్తిగా తీసుకుని దళిత, బహుజన, మైనార్టీ వర్గాలు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం దిశగా సాగుదాం**



పీడితులు, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడు, గొప్ప సామాజిక బహుజన విప్లవకారుడు, కుల, మత, జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం దాదాపు 350 ఏండ్ల కిందనే కృషి చేసిన బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.ఆధిపత్య అగ్రకుల పాలకులు బహుజనులను అణగద్రొక్కుతున్న 17వ శతాబ్దంలోనే స్వీయ సైన్యంతో దక్కన్‌పై బహుజనుల సంక్షేమ బాధ్యత తీసుకొని తొలి బహుజన రాజ్య స్థాపన చేసిన గొప్ప వీరుడు, తొలి బహుజన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఖిలాష్ పూర్ కేంద్రంగా చేసుకొని మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ఘనుడయన.ఒక సామాన్యుడు ఆధునిక ఆయుధాలను సమకూర్చుకొని రాజ్యాధినేతలనే ఎదురించిన ఘనత మన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ది. మహాత్మా జ్యోతిరావు పూలే కంటే ముందే సామాజిక న్యాయం అమలు చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు. రాచరికపు వ్యవస్థ నీడలో అగ్రకులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా, జమీందార్లు, జాగీర్దాల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తి పట్టిన వీరుడతను. ఖిలాషాపూర్‌ను కేంద్రంగా చేసుకొని మొఘలుల ఆధిపత్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.

ఛత్రపతి శివాజీ ఉత్తర భారతంలో విదేశీయుల నుంచి దేశాన్ని కాపాడి సంప్రదాయ బూజు పట్టిన వ్యవస్థపై తిరుగు బావుటా ఎగురవేసి, స్వరాజ్యాన్ని సాధిస్తున్న సమయంలో, దక్షిణాదిన భూస్వామ్య, దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత, బహుజన, మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించిన వాడు పాపన్న. అందుకే మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ సమకాలికుడిగా పాపన్నను చెబుతారు. వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ నుంచి..కాకతీయుల పాలన ముగిసిన 300 ఏండ్ల తర్వాత 1650 నుంచి 1709 వరకు సర్దార్ సర్వాయి పాపన్న ప్రస్థానం ఉంది. పాపన్న 1650 ఆగస్ట్ 18న వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ గ్రామంలో గౌడ కులంలో పుట్టారు. పాపన్న తండ్రి చిన్నతనంలోనే చనిపోతే తల్లి సర్వమ్మ అన్నీ తానై పెంచింది. పాపన్న కల్లు గీత వృత్తి కొనసాగిస్తూ యుక్త వయసులోనే భూస్వాములు, దేశముఖ్ ల దాష్టీకాలను సహించలేక, మూఢ సాంప్రదాయాలను ఎదిరించి పోరుబాట పట్టాడు. అగ్ర కులపెత్తనాన్ని అణచాలంటే ఒక్కరితో సాధ్యం కాదని గుర్తించి, మొత్తం బహుజన కులాలను ఏకం చేయాలనుకున్నాడు. తన స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళ్లు, దూదేకుల పీరు, కొత్వాల్ మీర్ సాహేబ్ తో కలిసి చుట్టూ జరుగుతున్న విషయాల గురించి చర్చించేవాడు. వాళ్లకు తన మార్గం, భవిష్యత్తు కార్యాచరణను వివరించి గెరిల్లా సైన్యాన్ని తయారు చేసుకున్నాడు. ధనవంతులు, జమీందారులపై రహస్య దాడులు చేసి కొల్లగొట్టిన ధనంతో మెరుగైన ఆయుధాలను సమకూర్చుకున్నాడు. దొరలు, భూస్వాముల వల్ల బాధలు పడుతున్న వారికి విముక్తి కలిగించి వారితో తన సైన్యాన్ని విస్తరించుకున్నాడు. ఈ క్రమంలోనే ఉత్తర తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో అగ్రకుల భూస్వాములు, ధనవంతుల గడీలు, కోటలపై దాడులు ప్రారంభించాడు. ప్రజల శ్రమను దోపిడీ చేసి కోటల్లో దాచుకున్న ఆస్తులను కొల్లగొట్టి పేద ప్రజలకు పంచిపెట్టి బందీలుగా మగ్గుతున్న అణగారిన వర్గాలను విడిపించాడు. ఈ నేపథ్యంలో పాపన్న సైన్యం అతి తక్కువ సమయంలోనే 12 వేలకు చేరింది. సైనిక శిక్షణ, యుద్ధ విద్యలను నేర్చుకోవడానికి పాపన్న వ్యూహాత్మకంగా అడుగులు వేశాడు. శిక్షణ పొందిన సైన్యం ద్వారా చిన్న చిన్న సంస్థానాలు, గడీలపై మెరుపుదాడులు చేసి వాటిని ఆక్రమించుకుంటూ, తన సొంత ఊరు ఖిలాషాపూర్ ను రాజధానిగా చేసుకుని, 1675లో సర్వాయిపేట కేంద్రంగా తన రాజ్యాన్ని స్థాపించి దుర్భేద్యమైన కోట నిర్మించాడు.

## పాపన్న రాజ్య విస్తరణ

పాపన్న జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగి ఆ తర్వాత కరీంనగర్, హుస్నాబాద్, ఎలగందుల రాజ్యాలను జయించాడు. ఇలా రాజ్య విస్తరణ చేసుకుంటూ, తాటికొండలో నిర్మించిన కోట ద్వారా సైనిక కార్యకలాపాలను ఉధృతం చేసి వరంగల్, నల్గొండ జిల్లాల్లోని రాజ్యాలను గెలిచాడు. ఎత్తైన గుట్టలు ఉన్న ప్రాంతాలనే రక్షణ దుర్గాలుగా ఎంచుకున్నాడు. కనుచూపు మేరలో శత్రువు కదలికలను కనిపెట్టేలా కోటల నిర్మాణం చేశాడని, ఆధునిక ఆయుధాలు వాడినట్లు ఆ కోటలపై ఉన్న ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది.

రాజనీతిలోనూ పాపన్న ఏ చక్రవర్తికీ తీసిపోడు. స్వయం సమృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు చేశాడు. తాటికొండ లాంటి ప్రాంతాల్లో వ్యవసాయ అభివృద్ధికై చెక్ డ్యామ్ లను కట్టించాడు. కులవృత్తులను ప్రోత్సహించాడు.హుస్నాబాద్ లో ఎల్లమ్మ చెరువును తవ్వించాడు.ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించాడు. ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ఎన్నో కోటలు, చెరువులు నిర్మించారు. 1678 వరకు తాటికొండ, వేములకొండలను అధీనంలోకి తెచ్చుకుని విజయ దుర్గాలను నిర్మించాడు. 1708 వరకు మొఘల్ ఏలుబడిలో ఉన్న ఓరుగల్లు, భువనగిరి కోటలను చేజిక్కించుకుని, భువనగిరి, వరంగల్, కొలనుపాక, జఫర్ ఘడ్, చేర్యాల్, బైరానుపల్లి, నల్గొండ, కరీంనగర్, హుస్నాబాద్, హుజూరాబాద్ మొదలు మెదక్ జిల్లా పాపన్నపేట వరకు ఉన్న ప్రాంతాలను తన సామ్రాజ్యంగా చేసుకుని పాలించాడు. ఇలా సర్వాయిపేట కోటతో మొదలుపెట్టి తన అధీనంలోకి వచ్చిన ప్రాంతాల్లో 20 కోటలను నిర్మించాడు. 1700%-%1705 మధ్యకాలంలో ఖిలాషాపూర్లో మరో దుర్గం నిర్మించాడు. యుద్ధ విద్యల్లో ఆరితేరిన సైన్యాన్ని సమకూర్చుకున్న పాపన్న ఖిలాషాపూర్ కేంద్రంగా రాజ్యపాలన చేస్తుండటంతో ఈ ప్రాంతాల నుంచి రావలసిన పన్నులు తగ్గిపోవడంతోపాటు రాజ్యాలు ఒక్కొక్కటి చేజారుతుండటంతో అప్పటి ఢిల్లీ సుల్తాన్ ఔరంగజేబుకు కలవరం కలిగించింది. పాపన్నను బంధించాలని అప్పటి కొలనుపాక పాలకుడు రుస్తుందిల్ ఖాన్ ను ఆదేశించడంతో తన సైన్యాధినేత ఖాసింఖాన్ ను పాపన్నపై దాడికి పంపించాడు. ఖిలాషాపూర్పై దాడికి వచ్చిన ఖాసింఖాన్ను హతమార్చి అతడి సైన్యాలను పాపన్న తిప్పికొట్టాడు. కొంత కాలం తర్వాత ఏకంగా రుస్తుందిల్ ఖాన్ రంగంలోకి దిగి, పాపన్న సైన్యానికి పెద్ద ఎత్తున నష్టం చేసి, ఖిలాషాపూర్ కోటను నేలమట్టం చేశాడని, అనంతర కాలంలో తిరిగి పాపన్న ఖిలాషాపూర్ కోటను మరింత శత్రుదుర్భేద్యంగా మార్చాడు.

ఔరంగజేబు మరణానంతరం దక్షిణాదిన మొఘల్ పాలన మరింత పట్టు తప్పడంతో, పాపన్న గోల్కొండ కోటపై దాడికి పథకం వేస్తున్న తరుణంలో, మొఘల్ రాజు బహదూర్ షా పాపన్నను స్వయం పాలకునిగా సంధికి ఆహ్వానించాడు. సంధికి వచ్చిన పాపన్నను ఎర్ర తివాచీ పరచి గౌరవంగా ఆదరించారని ఆంగ్ల చరిత్రకారుడు టీడబ్ల్యూ హేగ్ తన రచనల్లో పేర్కొన్నారు. కొంత కప్పం చెల్లించి గోల్కొండ కోటకు రాజుగా కొనసాగవచ్చని బహదూర్ షా చేసిన ప్రతిపాదనకు అంగీకరించిన పాపన్న, మొఘల్ చక్రవర్తి కోరిన కప్పాన్ని చెల్లించి గోల్కొండ కోటపై బహుజనుల జెండాను ఎగురవేశాడు. అయితే బహుజనుడైన పాపన్నను గోల్కొండ కోటకు రాజుగా చేయడాన్ని జమీందార్లు, దేశముఖ్ లు, జాగీర్దార్లు జీర్ణించుకోలేకపోయారు. పాపన్నను ఎలాగైనా రాజ్యాధికారం నుంచి తప్పించాలని కుట్రలు పన్నారు. మొఘల్ చక్రవర్తుల రాజ్య విస్తరణను అడ్డుకుని 30 ఏండ్లు తెలంగాణ గడ్డని పాలించిన పాపన్న విజయాలకు బెదిరిపోయిన సుభేదార్లు, మొఘల్ తొత్తులైన భూస్వాములు కుట్ర పన్ని పాపన్న పరిపాలనలో తాము కొనసాగలేమని, ఆయనను పదవి నుంచి తప్పించాలని బహదూర్ షాను వేడుకోవడంతో, పాపన్నను బంధించి తేవాలని ఆయన సైన్యాన్ని ఆదేశించారు. దీంతో యూసఫ్ ఖాన్ రుబ్బహాని నాయకత్వంలో పెద్ద ఎత్తున మొఘల్ సైన్యం పాపన్నపై మూకుమ్మడిగా దాడికి దిగగా, ఇరు సైన్యాల మధ్య భీకర పోరులో పాపన్న తీవ్రంగా గాయపడి తప్పించుకున్నాడు. తనకు సురక్షిత ప్రాంతంగా భావించి హుస్నాబాద్ ప్రాంతానికి వచ్చి అక్కడ ఎల్లమ్మ గుడిని కట్టించి, రహస్యంగా కల్లు గీత కార్మికుడిగా జీవనం సాగించాడని చరిత్రకారులు చెపుతున్నారు. ఈ తరుణంలో ఒక ద్రోహి అందించిన సమాచారంతో మొఘల్ సైన్యం ఆయనను గుర్తించి బంధించడానికి ప్రయత్నించగా, శత్రువు చేతిలో మరణించడం ఇష్టం లేక పాపన్న ఆత్మహత్య చేసుకున్నాడని ప్రజల్లో ఒక కథనం ఉంది. మరో కథనం ప్రకారం 1709లో ఇరు సైన్యాల మధ్య జరిగిన పోరులో మొఘల్ సైన్యం ఆయనను బంధించి శిరచ్ఛేదనం చేసి తలను బహదూర్ షాకు కానుకగా ఢిల్లీకి పంపి, పాపన్న మొండాన్ని గోల్కొండ కోటకు వేలాడదీశారని మరో కథనం కూడా ప్రచారంలో ఉంది. వివిధ కథలు ప్రచారంలో ఉన్నా ఆయన ఒక యోధుడిగా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

సర్వాయి పేట లో పాపన్న గౌడ నిర్మించిన కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి 4.5 కోట్ల రూపాయలు ప్రభుత్వం విడుదల చేసింది. పాపన్న తవ్వించిన ఎల్లమ్మ చెరువు ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తుంది. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి,వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. పాపన్న గౌడ్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా ఉండేలా ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి నేడు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ గారి,మంత్రి పొన్నం ప్రభాకర్ గారి నేతృత్వంలో శంకుస్థాపన చేసుకుంటున్నాం. ప్రతి గ్రామగ్రామాన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయన చరిత్ర భవిష్యత్ సమాజానికి తెలిసేలా ప్రభుత్వం కృషి చేస్తుంది



నాగరాజు

# భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి


**- తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ ప్రభుత్వాన్ని డిమాండ్**



**వెలుతురు, హైదరాబాద్ ఆగస్టు 16 :**
గత 15రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కు రైతులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతున్న ప్రభుత్వం యంత్రాం గం చోద్యం చూస్తోందని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రచార కార్య దర్శి జె దశరథ్ మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులను వెంటనే గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాం డ్ చేశారు. నల్లకుంటలో ఆయన మాట్లాడుతూ గత రెండు మూ డు వారాలుగా వాతావరణ శాఖ ప్రభుత్వానికి ఎప్పటి కప్పుడు హె చ్చరికలు ప్రభుత్వానికి జారీచేస్తూ రైతాంగని అప్రమత్తం పరచడంలో అగ్రికల్చర్ అధికారులు నిమ్మకు నీరెతే విదంగా చోద్యం చూస్తూన్నా రని ఆయన విస్మయం వ్యక్తపరిచా రు. రైతులకు తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలను జిల్లా వారీగా ప్రతి మండలంలో ఎంత మిల్లీ మీ టర్స్ వర్షపాతం నమోదైనధో కూడా అధికారులు ప్రభుత్వానికి సరైన స మాచారం లేదని ఆవేదన వ్యక్తం చే శారు. ప్రభుత్వం వెంటనే తెలంగా ణలోని కొన్ని జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు ముఖ్యంగా దాదాపు 17.18. మిల్లీ మీటర్స్ వర్షపా తం గత 15 రోజులుగా నమోదైది ఈ 4 రోజుల్లో కూడా బారీ నుండి అతి బారి వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా చెబుతున్నాయని తెలిపారు. ముఖ్యగా ఆదిలాబాద్, కామారెడ్డి, ఆసీపబాద్, వరంగల్, మెదక్, నిర్మల్, పెద్దపల్లి నిజా మాబాద్ రంగారెడ్డి జిల్లాలోని కొన్ని ప్రాం తాల్లో అతి భారీ వర్షాలు వచ్చే విధంగా ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వ్యక్తం చేస్తున్నారని ఇందుకు అధికారులు ప్రజలను అప్రమత్తం చేయా లని సూచించారు. అదేవిధంగా రైతులకోసం ఒక ప్రత్యేక మార్కెట్ ఫౌండ్ ను ప్రభుత్వం వెంటనే ఏర్పా ట్టు చేసీ మార్కెట్ ఫండ్ ద్వారా పంటలను కోల్పోయిన రైతులు ప్రభు త్వం వెంటనే మార్కెట్ ఫండ్ ద్వా రా 50. కోట్ల రూపాయలు మార్కె ట్ ఫండ్ ప్రభుత్వం వెంటనే మార్కె ట్ ఫండ్ విడుదల చేయాలని ఆ యన స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు పక్షపాతిగా ప్రజల మెప్పు కోసం ప్రయత్నించాలని దశరథ్ ఆరోపించారు. నగరంలో సీఎం రేవంత్ రెడ్డి ముంపు ప్రాంతాల్లో పర్యటించడం పట్ల తెలుగు దేశం పార్టీ తరపున స్వాగతిస్తున్నామని అన్నారు. నగరంలో ఇటీవల కురిసి న వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, తదిత ర మౌలిక సమస్యలపై ముఖ్యమం త్రి సహా యనిధి కింద హైదరాబాద్ నగరానికి వెం టనే 20కోట్ల రూపా యలు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని ఈసందర్భంగా జె.దశర థ్ సీఎం రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశా రు.

# ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహానేత గౌతు లచ్చన్న

**- ఆయన పోరాటం,నిజాయితీ నేటి యువతకు స్ఫూర్తిదాయకం**
**- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్**




**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**
స్వాతంత్ర్య సమరయోధులు,బడుగు బలహీన వర్గాల పెన్నిధి,భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే పేరు కలిగిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అని ఆయన 116వ జయంతి సందర్భంగా ఆయన దేశానికి చేసినటువంటి సేవల గురించి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కొనియాడారు.నేటి తరానికి,యువతకు అయన పోరాటం ఒక ఆదర్శమని ఇతను వివి గిరి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ మొదలగు అనేకమంది జాతీయ ఉద్యమ నాయకులతో కలిసి భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో పోరాటంలో పాల్గొని అనేక పర్యాయాలు జైలుకు వెళ్లారని అన్నారు.చైతన్య స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన గౌతు లచ్చన్న గారి జీవితం మనందరికీ పోరాట స్ఫూర్తిని కలిగించే ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు.శ్రీకాకుళం జిల్లాలోని బారువా అనే మారుమూల గ్రామంలోని గౌడ కల్లుగీత కుటుంబంలో పుట్టిన అయన హైస్కూల్ విద్యను మాత్రమే అభ్యసించినప్పటికి, పేరుపొందిన ఉపన్యాసకుడుగా లక్షలాదిమందిని తన ప్రసంగాలతో ఉర్రూతలూగించి,స్ఫూర్తిని రగిలించి యువతను స్వాతంత్ర్య ఉద్యమంలోకి మరల్చగలిగారు.దేశం కోసం బ్రిటిష్ వారితో పోట్లాడినా,స్వాతంత్ర్యం అనంతరం రైతుల పక్షాన నిలిచి పోరాడిన,పదవులను తృణప్రాయంగా త్యజించినా అది కేవలం సర్దార్ గౌతు లచ్చన్న గారికే సాధ్యమయ్యింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం వారి యొక్క అభ్యున్నతి కోసం కోసం పోరాటం చేసినవారిలో గౌతు లచ్చన్న అగ్రగణ్యులు.



# వైద్య గర్జన ఆత్మీయ సమ్మేళనం



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు ఉస్మానియా మెడికల్ కాలేజీ 2005 బ్యాచ్ కు చెందిన వైద్య విద్యార్థులు యావత్తు తెలంగాణ వైద్యులను,వైద్య విద్యార్థులను వైద్య సిబ్బంది అందరినీ కూడగట్టి 2010 సంవత్సరంలో వైద్య గర్జన ద్వారా తెలంగాణ వైద్య సమాజాన్ని చైతన్యపరిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పై చేసిన పోరాటం అప్పట్లో పెను సంచలనాన్ని సృష్టించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించింది. ఆ వైద్య గర్జన ను పురస్కరించుకొని ఈరోజు ఉస్మానియా వైద్య కళాశాల ఆడిటోరియంలో డాక్టర్ దుర్గా కిరణ్ ఆధ్వర్యంలో వైద్య గర్జన ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెడికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ బొంగు రమేష్ . ప్రత్యేక అతిథిగా టిపిహెచ్డీఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్ధన్ హాజరయ్యారు.2010 సంవత్సరంలో ఉస్మానియా మెడికల్ కాలేజీలో జరిగిన వైద్య గర్జన సభ నాయకులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించడం జరిగింది.ఆరోజు జరిగిన పరిస్థితులు, ఉద్విగ్న క్షణాలను నెమరు వేసుకుని నాయకులు భావోద్వేగానికి లోనయ్యారు. డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ వైద్య గర్జన గురించి చరిత్రలో లేకుండా చేశారని ,చరిత్రని గుర్తుకు చేసుకోవడానికి ,ఆస్ఫూర్తిని ముందుకు కొనసాగించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలియజేశారు.డాక్టర్ బొంగు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో వైద్యుల పాత్ర వెళలేనిది అని తమ విధులకు ఆటంకం కలిగించుకుండానే రాష్ట్ర సాధన పోరాటాలను ఉదృతం చేశారని రాష్ట్ర పునర్నిర్మాణంలో కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థులు మరియు పూర్వ ఉద్యమ నాయకులు, కళాశాల సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు

# పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**
పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య విమర్శించారు. బకాయిల విడుదల కోసం ఈ నెల 20న కళాశాలలను బహిష్కరించి , విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ లను ముట్టడిస్తామని అన్నారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన, జరిగింది ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ... కాంట్రాక్టర్లకు వేల కోట్లు బిల్లులను రిలీజ్ చేస్తూ... 15 లక్షల విద్యార్థుల బకాయిల విడుదలలో మాత్రం జాప్యం వహిస్తున్నారన్నారు. ఈ బకాయిల విషయంలో ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ను అనేక సార్లు కలిసామని , కానీ ఆయన కూడా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా , ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు 20 రూపాయలు కూడా విడుదల చేయలేదని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని పెండింగ్ లో ఉన్న 8 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

# నేర్రపల్లి గ్రామంలో కంఠమహేశ్వరస్వామి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి



**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు16:**
ఇబ్రహీంపట్నం మండలం నేర్రపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కంఠ మహేశ్వరస్వామి బోనాల ఉత్సవాల సందర్భంగా మహిళలు భారీ ఎత్తున బోనం ఎత్తుకొని గ్రామ విధుల్లో తిరుగుకుంటు శివసత్తుల ఆటపాటలతో బోనాలు కంఠమహేశ్వర దేవాలయం వద్దకు చేరుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో కంఠమహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసిన గౌడ సంఘం పెద్దలు అనంతరం మహిళలు కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో బోనాలు సమర్పించి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే

**నాగార్జునసాగర్,ఆగస్టు16( వెలుతురు):**
అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. నిడమనూరు మండలంలోని జంగాలవారి గూడెంలో రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనం, రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు గూడు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా చేయూత అదిస్తుందన్నారు. ఇల్లు మంజూరు కాని వారు ఆందోళన చెందవద్దని, అర్హులైన పేద వారందరికీ ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు యడవల్లి వల్లబ్ రెడ్డి, ముంగి శివమారయ్య, కొండా శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ విజయ్ కుమార్, రూపని కృష్ణయ్య, షేక్ జానీ పాషా, శిరీషాల యాదగిరి, డీలర్ సైదాచారి పాల్గొన్నారు.




# గ్రామపంచాయతీ కార్మికులకు ఆరోగ్య,ఉద్యోగ భద్రత కల్పించాలి

**- కార్మికుల సంరక్షణ సిఐటియు లక్ష్యం**

**- సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 16**

గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతి రెడ్డి సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డుల వితరణ కార్మికుల శ్రేయసే లక్ష్యంగా సిఐటియు పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం పేర్కొన్నారు.గ్రామపంచాయతీ కార్మికులకు జిల్లా పంచాయతీ అధికారి చొరవతో ప్రభుత్వం ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డులను శనివారం ఆయన రామన్నపేట మండల కేంద్రంలోని,గ్రామపంచాయతీ కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గ్రామపంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డు జారీ చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని కాకుండా రంగాల వారీగా విధులు నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వృత్తిలో ఉండి చనిపోయిన కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ కల్పించాలి. వయోభారంతో పని చేస్తున్నటువంటి పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి వారసులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ లో పేర్లు లేని కార్మికులకు గత 8 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని,గ్రామపంచాయతీలో పని చేసే ప్రతి ఒక్క కార్మికునికి పేర్లు ఆన్లైన్లో చేయాలని ఉద్యోగ,ఆరోగ్య భద్రత కల్పించాలని, హెల్త్ కార్డును జారీ చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 26 వేల వేతనం ఇవ్వాలని 51వ జీవో రద్దు చేయాలలి ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగే సోములు, జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బందెల బిక్షం, మండల ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము, మండల అధ్యక్షులు గాదె ఎల్లయ్య, మండల మహిళా కోకన్వీనర్ మంచాల రేణుక, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు బూడిద ముత్తయ్య,కాడ యాదమ్మ, గోగు మహేష్, ఉప్పునూతల నర్సింహా, చిత్రకంటి శోభ, కొండగడప నవీన్, శ్యామ్, తుర్కపల్లి రాములు, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా ఆధిపత్య విష కౌగిలిలో దేశాన్ని బందీ చేస్తున్న మోడీ.

**- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్.**



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 16**

అమెరికా ఆధిపత్యాన్నినిలువరించడంలో మోడీ ప్రభుత్వం విఫలం చెందాడని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ తెలిపారు. సిపిఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెమినార్ కు ముఖ్య వత్తగా హాజరై మాట్లాడుతూ గత కాలం నుండి అనేక దేశాలపై ఆర్థికాంక్షలు విధిస్తూ ఆయుధ సంపత్తితో ప్రపంచాన్ని శాసించాలనే యుద్ధోన్మాదంతో అమెరికా ముందుకు పోతుంటే తన గెలుపు కోసం సహకరించిన నరేంద్ర మోడీ ప్రస్తుతం భారత్ మీద అనేక వాణిజ్య సుంకాలు వేస్తూ దేశ సార్వభౌమత్వాన్ని అవమానపరిస్తుంటే విశ్వగురువు అని గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు. ప్రపంచ దేశాలను బెదిరింపులకు గురి చేస్తూ ఆర్థిక వ్యవస్థను చిన్నభిన్నం చేస్తున్న అమెరికా పట్ల భారత ప్రభుత్వం మౌనం విడాలని అన్నారు. మోడీ ట్రంప్ మధ్య అవినాభావ సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, పిఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు అవ్వారి గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్,బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెల్ల నరసింహ చారి, కందులహనుమంతు,బోయిని ఆనంద్, ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివకుమార్ ఈర్లపల్లి ముత్యాలు, మండల కమిటీ సభ్యులు గన్నబోయిన విజయభాస్కర్, బావండ్లపల్లి బాలరాజు, గొరిగే సోములు,మునికుంట్ల లెనిన్, దేశపాక రవి, గంటపాక శ్రీకృష్ణ, పల్లె సత్యం, తుర్కపల్లి నరేష్, గుణగంటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# నేడు 7 వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరం..

**- ప్రతి ఒక్కరికి కంటిచూపు బాగుండాలనే ఉద్దేశంతో ఉచిత కంటి వైద్య శిబిరాలు**

**- విడతల వారీగా ప్రతి మండలంలో ఉచిత కంటివైద్య శిబిరాల నిర్వహణ**

**- ఇప్పటికే 6 వైద్య శిబిరాలు నిర్వహించి 1051 మందికి సక్సెస్ ఫుల్ గా కంటి ఆపరేషన్లు**

**- నేడు గట్టుప్పల్ మండల ప్రజలకు 7వ, ఉచిత కంటి వైద్య శిబిరం**

**- నియోజకవర్గంలో కంటి సమస్యతో ఇబ్బందిపడే ప్రతి ఒక్కరికి సొంత ఖర్చులతో ఆపరేషన్లు చేయిస్తున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**









**మునుగోడు వెలుతురు ఆగస్టు 16:**

తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కంటి సమస్యలతో బాధపడొద్దనే ఆలోచనతో ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, ఇప్పటివరకు ఆరు విడతలుగా నిర్వహించిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలలో 4355 మందికి కంటి పరీక్షలు చేసి 1051 మంది కి కంటి ఆపరేషన్లు పూర్తిచేశారు, మునుగోడు మండల ప్రజలకు మునుగోడు లో నిర్వహించి న మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, రెండవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చండూరు మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన మూడవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండలప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నాలుగవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన ఐదవ విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి, చండూరు మండలం బంగారిగడ్డలో నిర్వహించిన ఆరవ విడత కంటి వైద్య శిబిరంలో 198 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేశారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి తల్లి, ప్రతి తండ్రి కి పెద్దకొడుకుగా మారి కంటి ఆపరేషన్ లు చేయిస్తున్నారు... రాబోయే మూడున్నర సంవత్సరాలలో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు.. ఆ ప్రణాళికలో భాగంగానే 10 పదివేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా టార్గెట్ పెట్టుకున్నారు.. దాంట్లో భాగంగానే నేడు (17-8-2025) ఆదివారం గట్టుప్పల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7 వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్ శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తు న్నారు.. గట్టుప్పల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను స్థానిక నాయకులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు... గట్టుప్పల్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఇప్పటికే గ్రామాలలో టామ్ టామ్ వేయించి ప్రచారం నిర్వాహించారు స్థానిక నాయకులు



# మార్పు దిశగా మునుగోడు....

కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆలోచనలకు ఆచరణ మొదలైంది

అభివృద్ధిలో స్థానిక నాయకులు భాగస్వామ్యం కావాలని పిలుపుకు భారీ స్పందన

మన బడులు మనమే అభివృద్ధి చేసుకోవాలన్న ఆశయానికి ముందుకొస్తున్న నాయకులు

మునుగోడు మండలం చోల్లెడు గ్రామానికి చెందిన వంగూరు అశోక్ యాదవ్ ప్రభుత్వ బడుల అభివృద్ధికి 1,00,000 రూపాయల విరాళం

లక్ష రూపాయల చెక్కును కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారికి అందించిన వంగూరు అశోక్ యాదవ్

**మునుగోడు వెలుతురు ఆగస్టు 16:**

# సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చూపుదాం - యం.వి.రమణ







**మహబూబాబాద్ వెలుతురు ఆగస్టు 16:**

శనివారం రోజున మహబూబాబాద్ లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన ర్యాలీ బహిరంగ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ , గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్, గీతా పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ , డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్, డాక్టర్ మురళి నాయక్ మహబూబాద్ ఎమ్మెల్యే, బలరాం నాయక్ మహబూబాబాద్ ఎంపీ, వద్దిరాజు రవిచంద్ర ఎంపీ, మాలోత్ కవిత మాజీ ఎంపీ, నిర్వహణ కమిటీ నాయకులు జెర్రిపోతుల వెంకన్న గౌడ్, ముత్యం వెంకన్న గౌడ్, బిక్కి వెంకటేశ్వర్లు గౌడ్ , కేజీకేఎస్ మహబూబాబాద్ జిల్లా నాయకులు గౌని వెంకన్న, యమగాని వెంకన్న ,గునిగంటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాల్ కల్ మండలం లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

**- ముఖ్య అతిథులుగా పాల్గొన్న జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంతు...**



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని న్యాల్ కల్ మండలంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా న్యాల్ కల్ మండలం కుర్మ సంఘం అధ్యక్షులు గొల్ల నర్సింలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ జక్కుల హనుమంత్ హాజరయ్యారు. గోపికలు శ్రీకృష్ణ వేశాధారణతో చిన్నారులతో కృష్ణ భగవానునికి పూజలు నిర్వహించి, ఉట్టి కొట్టు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ భగవానుని జీవిత చరిత్ర గురించి విశ్వాహిందు పరిషత్ మండలం అధ్యక్షులు రాంచందర్ పవార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మల్గి మాజీ సర్పంచ్ జట్టుగొండ మారుతీ, ఓంకార్ యాదవ్, మల్గి ఎంపీటీసీ శివానంద, శ్రీపతి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, శివరాజ్ మాజీ ఎస్.ఎం.సీ. చేర్మెన్, నర్సప్ప, అశోక్, చల్కి దత్తు, గొల్ల దిలీప్ కుమార్, యాదవ్, శ్రీనివాస్, పెద్దగొల్లా శ్రీనివాస్, గొల్ల రాములు, మారుతీ, మహేష్, సిద్దు, సునీల్, మొగుళప్ప, రాకేష్, ఆకాష్, విట్టల్, గొల్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ, భగవద్గీతను అనుసరించాలి

**- ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని విడిచిపెట్టి ప్రజాహిత మార్గంలో నడవాల్సిన అవసరముంది...**

**- బర్దిపూర్ ఆశ్రమం పీఠాధిపతులు**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**




విశ్వానికి మార్గదర్శకుడైన శ్రీకృష్ణుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, భగవద్గీతను అనుసరించాలని సంగారెడ్డి జిల్లా ఝురాసంగం మండల పరిధిలోగల బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖామణి అవధూత గిరి, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. శనివారం శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ఆశ్రమంలోని అష్ట శైలి సప్త ఋషుల గో శ్రీ కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శంఖనాదం, ఘంటానాదం, అచ్యుతాది దేవతలకు ఆహ్వానం, పంచామృత అభిషేకం, ఆలంకార సేవ, పారాయణ %-% శాస్త్రోపచారం, మహా మంగళహారతి, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ అవధూత గిరి, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ లు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజం సత్యం, ధర్మాన్ని అనుసరించే మార్గంలో సాగేందుకు శ్రీకృష్ణుని బోధనలు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని విడిచిపెట్టి ప్రజాహిత మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఆశ్రమంలో శ్రావణ మాస పూజలు కొనసాగుతున్నాయి.

# బీరంగూడ లో ఘనంగా నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలో పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్

**అమీన్‌పూర్ వెలుతురు ఆగస్టు 16:**



అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి ఆశీర్వాదంతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, సమాజం ఐక్యతతో ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు.

## హైదరాబాద్ నగర మొదటి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్





**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్ నగర మొదటి మేయర్, ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ గారి 131 వ జయంతి కార్యక్రమం శనివారం జూబ్లీ బస్ స్టేషన్ వద్ద ఉన్న వారి విగ్రహం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్యఅతిథిగా హాజరై కృష్ణస్వామి ముదిరాజ్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణ స్వామి ముదిరాజ్ మహనీయులని, విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మి, అంబేద్కర్ పూలే గార్లను ఆదర్శంగా తీసుకుని వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి కృషి చేశారని, 1921 లోనే హైదరాబాదులో బాలికల పాఠశాలను ఏర్పాటు చేపించారని, ఆయన సమాజ సేవ ద్వారా ప్రజలకు దగ్గరయ్యారని, చట్టసభల ద్వారా ఇంకా ఎక్కువ సేవ చేయొచ్చు అనే ఉద్దేశంతో రాజకీయాలలో అడుగుపెట్టి 1957లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ నగర మొట్టమొదటి మేయర్ గా ఎన్నికయ్యారని, వారి గొప్పదనాన్ని భవిష్యత్తు తరాలకు కూడా తెలియాలనే ఉద్దేశం తో పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చారని, ప్రభుత్వంతో మాట్లాడి వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని, కంటోన్మెంట్ నియోజకవర్గంలో ముదిరాజ్ భవన నిర్మాణానికి కూడా కృషి చేస్తానని తెలిపారు.

## యాదవుల ఐక్యతను, గౌరవాన్ని ప్రతిబింబించే ఉద్యమంగా రేజంగ్లా రజ్ కలశ యాత్ర



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**
రేజంగ్లా రజ్ కలశ యాత్ర అఖిలభారత యాదవ్ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శుభం కన్వెన్షన్ నుండి ప్రారంభమైంది. ఈ యాత్ర ఐక్యతను, గౌరవాన్ని ప్రతిబింబించే ఉద్యమంగా , అత్యంత ఉత్సాహభరితంగా, ప్రజల చైతన్యంతో ముందుకు కొనసాగుతుంది. ఈ యాత్రకు ప్రజల నుండి వచ్చిన స్పందన, యువతలో కనిపించిన చైతన్యం, గ్రామాల నుండి, యావత్ హైదరాబాద్ నుండి వచ్చిన యాదవుల, యాదవ ఉద్యోగులు, అధికారులు,యాదవ రిటైర్డ్ అధికారులు, యాదవ శక్తి ఈ కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయి. ప్రజలు, యువత, మండల స్థాయి నాయకులు పూలమాలలతో స్వాగతం పలికారు. రేజంగ్ లా అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ యాత్రలో పాల్గొన్న ప్రతి మిత్రునికి, ప్రతి బాధ్యునికి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తూ, మీరు చూపిన ఐక్యత, నిబద్ధత, మరియు యాదవ గౌరవాన్ని నిలబెట్టే తపన మాకు మరింత ప్రేరణనిచ్చింది. ఈ కలశ యాత్ర కేవలం ఒక కార్యక్రమం కాదుఇది మన యాదవుల చరిత్రను, గౌరవాన్ని, మరియు భవిష్యత్తును ప్రతిబింబించే ఉద్యమం గా వర్ణించిన కృష్ణ యాదవ్.ఈ కార్యక్రమంలో తెలంగాణ యాదవ్ అఫీషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షులు, మన్నెబోయిన కృష్ణా యాదవ్, ప్రధాన కార్యదర్శి, చోళ ఓంప్రకాశ్ యాదవ్, సహా అధ్యక్షులు, గుండెబోయిన వెంకటేశ్ యాదవ్, అంజన్ యాదవ్, దుబాయ్ శ్రీనివాస్ యాదవ్, సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వర సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**- ముఖ్య అతిధులుగా పాల్గొన్న బీజేపీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్...**

**- ప్రముఖ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి...**

**- ఏబిబిఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్...**



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**
కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని శాంతి నగర్ వర సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలను సాంస్కృతిక సోయగాలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తి, శ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జహీరాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్, ప్రముఖ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, ఏబిబిఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ లు హాజరయ్యారు. కృష్ణుడు, గోపికలు, రాధా వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ రెడ్డి, వాసు నాయక్, వంశీ, సూర్య, సునీల్, అప్పం శ్రవణ్, జగదీష్, ఆనంద్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఘనంగా నిర్వహించాలి.

**- గౌడ సంఘాల సమన్వయ కమిటీ పిలుపు.**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**
భారత తొలి తెలుగు విప్లవ వీరుడు మొదటి బహుజన రాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోవాలని అందులో భాగంగా చిక్కడపల్లిలోని కల్లు కంపౌండ్ ముందరా18 న నిర్వహిస్తూన్నమని గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్,వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయకుమార్ గౌడ్ కలిసి శనివారం చిక్కడపల్లి లో రాష్ట్ర కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కల్లుగీత వృత్తి తీవ్ర సంక్షోభంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు హైదరాబాద్ తో సహా రాష్ట్ర వ్యాపితంగా వందలాది కల్లుగీత సొసైటీలు మూతపడ్డాయని అన్నారు తక్షణమే బేషరతుగా కల్లుదుఖాణాలను తెరిపించాలి ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు తక్షణమే ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహాన్ని నెలకొల్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం 10 లక్షలు ఎక్స్ రేషియోను ప్రకటించాలి ఇప్పటికే పెండింగులో ఉన్న రూ/- 13.5 కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం 25 శాతం వైన్స్, బార్లు కల్లుగీత సొసైటీలకు కేటాయించాలి. కోకాపేటలో "గౌడ ఆత్మగౌరవ భవన్" ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును 18న ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.. ప్రభుత్వం అధికారికంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాలను నిర్వహిండాన్ని స్వాగతిస్తున్నాం అన్నారు.. ఈ సమావేశంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్,వైస్ చైర్మన్ గడ్డమీద విజయ్ కుమార్ గౌడ్,బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్. దుర్గయ్య గౌడ్,బీసీ రచయితల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బైరు శేఖర్, ఎంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బడేసాబ్,సింగం నాగేశ్వర్ గౌడ్, బాలగౌని వెంకటేష్ గౌడ్ మరియు ఐలన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ తప్పనిసరి
# ఆగస్టు 25న ఇందిరాపార్క్‌లో దీక్ష

**- ఢిల్లీలో బీసీ రిజర్వేషన్లపై జాతీయ స్థాయి చర్చలు - వెయ్యిమంది హాజరు**

**- రిజర్వేషన్ రాకపోతే బీసీలకు న్యాయం ఎప్పటికీ కాదని ఆర్. కృష్ణయ్య వ్యాఖ్య**

**- రాష్ట్రవ్యాప్తంగా బీసీ ప్రజాప్రతినిధులు దీక్షలో పాల్గొనాలని పిలుపు**

**- బీసీల వృత్తి అభివృద్ధి, రక్షణకు కొత్త చట్టం అవసరం - బీసీ సంఘం**



**మెదక్ వెలుతురు ఆగస్టు 16:**
బీసీలకు (బ్యాక్‌వర్డ్ క్లాసులకు) స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు తప్పనిసరిగా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 25వ తేదీన ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద భారీ దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లు సాధించుకోవాలంటే పార్టీలకతీతంగా అన్ని వర్గాల బీసీ ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పిటీసీలు, ఎంపీపీలు, బీసీ సంఘాల నాయకులు ఒక్కటిగా కదలివచ్చి దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. "ఇప్పటికీ రిజర్వేషన్లు రాకపోతే, ఇక ఎప్పటికీ రావు. అందుకే ఇది చారిత్రాత్మక పోరాట సమయం" అని కృష్ణయ్య స్పష్టం చేశారు.

**ఢిల్లీలో కీలక చర్చలు**

ఆగస్టు 18, 19 తేదీలలో ఢిల్లీలో బీసీల సమస్యలపై రెండు రోజులపాటు కీలక చర్చలు జరగనున్నాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న బీసీ కులాలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, వృత్తుల అభివృద్ధి, కులాలను రక్షించే ప్రత్యేక చట్టం, కులవృత్తులను దూషించే వారిపై కఠిన చర్యలు వంటి అంశాలపై చర్చ జరగనుందని వివరించారు. ఈ సమావేశానికి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరుకానున్నారని కృష్ణయ్య చెప్పారు.

**బీసీ నాయకుల మద్దతు**

ఈ కార్యక్రమంలో అనేకమంది బీసీ నాయకులు పాల్గొన్నారు. వీరిలో డాక్టర్ వెంకటేష్, సీనియర్ జర్నలిస్ట్ రాష్ట్ర బీసీ సంఘం సెక్రటరీ శివగౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు ఆంజనేయులు, మెదక్ జిల్లా జనరల్ సెక్రటరీ ఇమాపురం వెంకటేష్ గౌడ్, బీసీ నాయకుడు జాలిగాము శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ నాయకులు తదితరులు ఉన్నారు. వీరందరూ ఏకగ్రీవంగా మాట్లాడుతూ, "బీసీల హక్కులు సాధించుకోవడంలో వెనుకడుగు వేయం. 42% రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు.

**బీసీల హక్కుల కోసం నిరంతర పోరాటం**

బీసీ నాయకులు మాట్లాడుతూ, బీసీ కులాలు శాతం వారీగా అత్యధికంగా ఉన్నప్పటికీ అవసరమైన రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం అందటం లేదని వేదన వ్యక్తం చేశారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వకపోతే, అది మహా అన్యాయం అవుతుందని వారు పేర్కొన్నారు. బీసీల కోసం ప్రత్యేక అభివృద్ధి బోర్డులు, వృత్తి అభివృద్ధి కార్పొరేషన్లు, చట్టపరమైన రక్షణ, సరైన రాజకీయ ప్రాతినిధ్యం లభించేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తీర్మానించారు.

**తుది పిలుపు**

ఆగస్టు 25న జరగబోయే దీక్షలో ప్రతి బీసీ వర్గం నుంచి వేలాదిగా కదలివచ్చి పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంఘం పిలుపునిచ్చింది. "బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించడం అనేది కేవలం హక్కు మాత్రమే కాదు, సామాజిక న్యాయం సాధన" అని నేతలు స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను చూసి వణకిపోతున్న బిఆర్ఎస్ నాయకులు

**- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కండేం నర్సింలు....**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో శనివారం పార్లమెంట్ ఇంచార్జ్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టణ అధ్యక్షులు కండేం నర్సింలు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతం చాలా ప్రశాంతంగా ఉండేదని, బీఆర్ఎస్ నాయకుల రౌడీయిజం వల్లే అశాంతి నెలకొంటుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చిననాటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా అమలుచేస్తూ ఇప్పటికే రైతు రుణమాఫీ చేశామని, రైతుభరోసా, రైతు భీమా, రేషన్ కార్డుల జారీ, గృహాల్లో ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇల్లులేని వారికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్నామని, కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి బీఆర్ఎస్ వెన్నులో వణుకుపుట్టిందని పట్టణ అధ్యక్షుడు మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు హడావిడిగా హెూతి కె లో నిర్మించిన 660 డబుల్ బెడ్ రూమ్ లను ఎవ్వరికి బడితే వారికి కేటాయించడం జరిగిందని వారు ఆరోపించారు. 660 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గాను 526 లబ్ధిదారులకు ఇండ్ల తాళాలు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. మిగితా 134 మందికి కొన్ని అభ్యంతరాలు వచ్చాయని, వాటికి అధికారులు విచారణ చేసి అర్హులైన వారందరికీ ఇస్తారని



వారు తెలిపారు. ఎవ్వరు కూడ నిరాశ చెందవద్దని వారు సూచించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పట్లోళ్ల రామలింగ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి, జహీరాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు కండేం నర్సింలు, పి నర్సింహారెడ్డి, మొగుడం పల్లి మండల అధ్యక్షుడు మాక్సుద్ అహేమద్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ఖాజామీయా, తాజా మాజీ కౌన్సిలర్లు జహంగీర్ ఖురేషి, రాములు నేత, మోతీరం రాథోడ్, మొహమ్మద్ యూనుస్, మొహమ్మద్ అక్బర్, తహేర బేగం, మొహమ్మద్ ఇనాయత్ అలీ, నాయకులు మొయిజ్ లష్కరి, మొహమ్మద్ మొయిజుద్దీన్, శ్రీనివాస్ గౌడ్, జమిల్ ఖురేషి, నస్రుల్ల ఖాన్, సీనియర్ నాయకులు భీమయ్యా, పద్మారావు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నేతలకు మాజీ సర్పంచ్ రమణగోని దీపిక తనను పార్టీ బాధ్యతల నుండి తప్పించాలని వినతి

**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 16:**
బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా..గంగిడి మనోహర్ రెడ్డి బిజెపి నల్లగొండ జిల్లా అధ్యక్షులు డా.. శ్రీ. నాగం వర్షిత్ రెడ్డి కి శనివారం రోజున లింగోజిగూడెం గ్రామ మాజీ సర్పంచ్ రమణ గోని దీపిక తనకు అప్పగించిన పార్టీ బాధ్యతల నుండి తప్పించి మరొకరికి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. ముఖ్యంగా నాపై



నమ్మకం ఉంచి నల్లగొండ జిల్లా బి.జె.పి పార్టీ కార్యదర్శి గా పదవి ప్రకటించినందుకు ధన్యావాదములు కానీ నేను పార్టీకి పూర్తిగా సమయం ఇవ్వలేను. కావునా దయచేసి తప్పుగా భావించకుండా నాకు ఇచ్చిన జిల్లా భాధ్యతలను తొలగించి చౌటుప్పల్ పట్టణంలో వెరేవారికి అవకాశం ఇవ్వవలసిందిగా నా యొక్క మనవి అని వినతిపత్రం లేఖలో ఆమె పేర్కొన్నారు

## శ్రీకృష్ణుని ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించిన కాట శ్రీనివాస్ గౌడ్





**పటాన్‌చెరు వెలుతురు ఆగస్టు 16:**
శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలో దేవరాజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శ్రీకృష్ణుని ఊరేగింపు కార్యక్రమాన్ని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "శ్రీకృష్ణ జన్మాష్టమి మన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు, భక్తి భావాలను ప్రతిబింబించే పండుగ. సమాజంలో నీతి, ధర్మం, సత్యం స్థాపనకై శ్రీకృష్ణుడు చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి ప్రేరణ కావాలి" అని అన్నారు. తరువాత భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొని, అందరికీ శ్రీకృష్ణుని ఆశీస్సులు కలగాలని కోరుకున్నారు.

## ఇదేనా జగన్ మార్క్ దేశభక్తి: సోమిరెడ్డి

**అమరావతి,ఆగస్టు16( వెలుతురు):**
మాజీ సిఎంగా జగన్ పంద్రాగస్ట్ రోజు జాతీయ జెండా ఎగరేయక పోవడం దారుణమని, ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. గన్‌రెడ్డీ.. ఎందుకంత అహంకారమని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఈమేరకు ఆయన సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. లక్షల మంది ప్రాణాలర్పించి స్వాతంత్య్రం సాధించిన రోజు గుర్తు లేదా? అని నిలదీశారు. జగన్.. మీరు ఒక పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం విషయమైనా గుర్తుందా? పులివెందుల ఫలితంతో అసహనంగా ఉంటే మాత్రం జాతీయ పండగ మరిచిపోతారా? మీ రాజకీయ జీవితంలో ఇదో బ్లాక్ మార్క్ అని సోమిరెడ్డి మండిపడ్డారు.

## 18న ఫ్రీ మెగా సర్జికల్ కరెక్షన్ మరియు హెల్త్ క్యాంప్



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 16:**
ఫ్రీ మెగా సర్జికల్ కరెక్షన్ , హెల్త్ క్యాంప్ ఆగస్టు 18, ఉదయం 8:00 గంటలు సంస్కృతి రాజ్ భవన్ కమ్యూనిటీ హాల్, సోమాజిగూడ, హైదరాబాద్లోఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో, డిసేబుల్ ట్రస్ట్, అగర్వాల్ సేవాదళ్ పిట్టి ట్రస్ట్, డాక్టర్ నారి చారిటబుల్ ట్రస్ట్, రవి హీలియోస్ హాస్పిటల్, వికలాంగుల నెట్వర్క్, వికలాంగుల హక్కుల సాధన సమితి, ఎఫ్ఈడి జనజాగృతి ట్రస్ట్ ల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నారు.

ఈ శిబిరంలో అందించబడే సేవలు:
వికలాంగులకు ఉచిత శస్త్రచికిత్సలు
జనరల్ హెల్త్ చెకప్‌లు, డయాగ్నోస్టిక్ టెస్టులు, పోషకాహారం
కంటి పరీక్షలు మరియు ఉచిత కళ్లజోడు పంపిణీ
క్యాలిపర్స్, వీల్‌చైర్స్ ఎలక్ట్రిక్ మోటార్ వాహనాల పంపిణీ జరుగుతుంది.

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఉదయం 1:00 గంటలకు ఇట్టి శిబిరాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా
ప్రధాన అతిథులు:
హైదరాబాద్ కలెక్టర్ హరిచందన రాష్ట్ర మంత్రివర్యులు, అడ్లూరి లక్ష్మణ్ గారు, ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్లు హాజరవుతారని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ భీమ్ రెడ్డి , డిసేబుల్ ట్రస్ట్ సీఈఓ డా. విజయ్ భాస్కర్, డా. కీర్తన యాదవ్( నారి ఫౌండేషన్), నల్గొండ శ్రీనివాస్ (వికలాంగుల చైర్మన్), కిరణ్ గుత్తికొండ (స్టేట్ ప్రెసిడెంట్ - డిసేబుల్ రైట్స్), యశోభ, నాగభూషణ్, వేను లు సంయుక్తంగా సంయుక్త పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

## నిండుకుండలా మారిన ఎల్లంపల్లి ప్రాజెక్ట్

**- 20 గేట్లు ఎత్తిన ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు**

**- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16**
మంచిర్యాల జిల్లాలో గత వారం రోజులుగా కూర్చున్న వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 20,175 క్యూసెక్కులు. కడెం ప్రాజెక్టు నుంచి ఒక లక్ష 61 వేల క్యూసెక్కులు నీరు చేరుతుంది. ఎన్టిపిసి నుండి 121 క్యూసెక్కుల నీరు



చేరుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వివిధ రకాలుగా వస్తున్న పూర్తి నీటిమట్టం రెండు లక్షల 15,500 క్యూసెక్కుల నీరు చేరుతుంది అందుకుగాను ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 20 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. దిగువ ప్రాంతాన ఉన్న ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే లోతట్టు ప్రాంత ప్రజలు ఎగువ ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు సూచించారు

## భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వరద ప్రభావిత పరిస్థితులను పరిశీలించిన మంచిర్యాల డిసిపి



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16**
రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ ఐపీఎస్ స్థానిక పోలీస్ అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు రాళ్లవాగు, మంచిర్యాల, లక్సెట్టిపేట్ పరిధిలోనీ గ్రామాలు గంపలపల్లి, కొమ్ముగూడెం, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, చెరువులు, వాగులు, వంతెనలు మరియు ప్రధాన రహదారులను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. డీసీపీ మాట్లాడుతూ .. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాము అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము అని తెలిపారు. అలాగే వివిధ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కల్వర్టు, బ్రిడ్జిలు నీటిమునిగే ప్రమాదం ఉన్నందున, వరద నీటి ఉధృతిని అంచనా వేయకుండా నదులు, వాగులు, కాలువలు, కుంటలు దాటే ప్రయత్నం చేయకూడదు అన్నారు .వర్షాల కారణంగా ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకుండా, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అత్యవసరయూ సహాయం కోసం ప్రజలు 100 నంబర్‌కు కాల్ చేయవచ్చు అన్నారు.



# ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన జిల్లా కలెక్టర్

**- వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16**
వాతావరణ శాఖ సూచన, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజారక్షణ విషయంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టులో నీటిమట్టం వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 24 నుండి 36 గంటలు భారీ నుండి అతి భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శనివారం మంచిర్యాల జిల్లాలో రెడ్ అలర్ట్, ఆదివారం ఆరెంజ్ అలర్ట్ ఉందని, ప్రజారక్షణ దిశగా





అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతుందని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 15.6 టి.ఎం.సి. నీరు ఉందని, ఎస్.ఆర్.ఎస్.పి., కడెం ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఇన్ఫ్లో పెరుగుతుందని, ప్రాజెక్టులో 17 టి.ఎం.సి. నీటిమట్టం దాటితే ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేసి నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. టామ్ టామ్ ద్వారా నది పరివాహక ప్రాంతాల వద్దకు వెళ్లకుండా, వాగు, నది దాటకూడదని ప్రజలకు తెలియపరచడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేసే బిచ్చగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో నివసించే వారిని వెంటనే తరలించాలని, వాగులు, నదులు ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలను, వాహనదారులను అటువైపుగా వెళ్లకుండా సిబ్బందితో కొండగట్టు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రహదారులు, కల్వర్టులు దెబ్బతింటే ఆ ప్రాంతంలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, వైద్య సిబ్బంది వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం జరగకుండా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల తక్షణ సహాయం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736- 250501 ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. జిల్లాలో 90 మంది సభ్యులతో కూడిన 3 ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు, రక్షణ పరికరాలతో తక్షణ సహాయం కోసం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. లో లెవెల్ కాజ్ వేల వద్ద ప్రజలు వెళ్లకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి అప్రమత్తత చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16**
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల పనులు నీటి ప్రవాహం తగ్గిన తర్వాత చేపట్టి పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎదులబంధం గ్రామపంచాయతీలో తుంతుంగ వాగు సమీపంలో గల చెరువు పక్కన పాక్షికంగా దెబ్బతిన్న ఆర్ %డ% బి రోడ్డును మండల తహసిల్దార్ రాఘవేందర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి పరిశీలించి నీళ్లు తగ్గిన తరువాత పైపులు వేసి తాత్కాలిక మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన మేరకు రాబోవు మూడు రోజుల పాటు భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటు లో ఉంటుందని, జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాలలో అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టులు, ఉధృతంగా ప్రవహించే నదులు, వాగుల వద్దకు ఎవరు వెళ్లకూడదని, పోలీసు శాఖ అధికారులు బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అత్యవసర సమయాలలో మాత్రమే ప్రజలు బయటకు రావాలని తెలిపారు.





తక్షణ సహాయం, పునరావాస కేంద్రాల సమాచారం, ఇతర వివరాల కొరకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736-250501 నంబర్ ఏర్పాటు చేసి, 24 గంటలు తక్షణ సహాయం సేవలు అందుబాటులో ఉంచడం జరిగిందని, జిల్లాలో వరద, ఘటనల సమాచారం ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ కు అందించాలని తెలిపారు. వర్షాలు ఆగిన తర్వాత దెబ్బతిన్న రోడ్డు ప్రాంతంలో కల్వర్టు మంజూరు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16**
మంచిర్యాల జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాల సూచన ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, త్రాగు నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 9, 12, 13 వార్డులలో పర్యటించి వార్డులలో చేరిన వర్షపు నీటి స్థితిని పరిశీలించి కొత్త కొమ్ముగూడెం గ్రామంలోని చెరువు నీటి నిల్వ పరిస్థితిని మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన ప్రకారం మంచిర్యాల జిల్లాలో శనివారం రోజున రెడ్ అలర్ట్, ఆదివారం రోజున ఆరెంజ్ అలర్ట్ ఉన్నందున ప్రజల రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలోని కాజ్ వే లు, వాగులు, నదుల వద్దకు ప్రజలు ఎవరు వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు నిర్వహిస్తున్నామని, లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీటి సరఫరా చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నివాస ప్రాంతాలలో నీటి విలువలు లేకుండా తొలగించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. జిల్లాలో వరదలకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చిన ఎదుర్కొనేందుకు 3 ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు, జిల్లా అధికారులతో సిద్ధంగా ఉన్నామని, ప్రజల రక్షణకు కావలసిన పరికరాలు అందుబాటులో పెంచడం జరిగిందని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు పరిశీలించి ప్రజల తక్షణ సహాయం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రజలకు వివరించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండి బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# అలాస్కా వేదికగా అగ్రదేశాల భేటీ

**- సరదాగా మాట్లాడుకున్న ట్రంప్,పుతిన్**

**- సైనిక దర్పంతో ప్రదర్శించిన ట్రంప్**



**వాషింగ్టన్,ఆగస్ట్16( వెలుతురు):**
ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడమే లక్ష్యంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. అలాస్కా వేదికగా జరిగిన ఈ అరుదైన సమావేశం యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఇద్దరు నేతల వాగ్దాటి దృష్ట్యా ఈ భేటీ వాడీవేడిగా సాగుతుందని అంతా భావించారు. కానీ, అందుకు భిన్నంగా ట్రంప్-పుతిన్ చాలా ఆత్మీయంగా కన్పించారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడి 'పవర్ ప్లే' చూసి పుతిన్ ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యారు. అలాస్కాలోని జాయింట్ బేస్ ఎల్మెండార్ఫ్-రిచర్డ్సన్ సైనిక స్థావరానికి తొలుత ట్రంప్ చేరుకున్నారు. కాసేపటి తర్వాత పుతిన్ అక్కడకు విచ్చేశారు. రష్యా అధ్యక్షుడికి ట్రంప్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి చిరునవ్వుతో పలకరించారు. ఈ సందర్భంగా ట్రంప్ తమ సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించడం చర్చ నీయాంశంగా మారింది. వీరిద్దరూ అక్కడ ఏర్పాటు- చేసిన పోడియం వద్దకు వెళ్తుండగా.. వారి పైనుంచి బీ-2 బాంబర్లు, పలు రకాల ఫైటర్ జెట్లు- ప్రయాణించాయి. వాటిని చూసి పుతిన్ ఆశ్చర్యపోయారు. ఇక, వీరు ప్రయాణిస్తున్న కాన్వాయ్ వెళ్లే మార్గంలోనూ యుద్ధ విమానాలు వరుసగా పార్క్ చేసి ఉన్నాయి. ఇటీ-వల ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధం సందర్భంగా టెహ్రాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసేందుకు అమెరికా ఈ బీ-2 బాంబర్లను వాడిన సంగతి తెలిసిందే. తమ సైనిక సామర్థ్యాలను పరోక్షంగా పుతిన్‌కు చెప్పేందుకే ట్రంప్ ఈ మిలిటరీ విన్యాసాలు చేయించి ఉంటారని తెలుస్తోంది. రష్యా కూడా అణ్వాయుధ సామర్థ్యం కలిగిన దేశమే..! వీరి భేటీ- సందర్భంగా మరో ఆసక్తికర ఘటన చోటు-చేసుకుంది. సాధారణంగా పుతిన్ ఎక్కడకు వెళ్లినా తన సొంత వాహనాలను తీసుకెళుతుంటారు. అలాస్కాకు కూడా మాస్కో నంబర్‌ప్లేట్ ఉన్న వాహనశ్రేణి చేరుకుంది. అయితే, అందులో కాకుండా.. ట్రంప్‌తో కలిసి అమెరికా అధ్యక్షుడి 'బీస్ట్' వాహనంలో పుతిన్ ప్రయాణించడం ఆశ్చర్యపర్చింది. ఈ రైడ్ ముందస్తు ప్రణాళికలో భాగమో కాదో తెలియనప్పటికీ.. వీరిద్దరూ బీస్ట్‌లో వెనుక సీట్లో కూర్చుని సమావేశ వేదిక వద్దకు వెళ్లారు. 10 నిమిషాల ఈ ప్రయాణంలో ట్రంప్ మాట్లాడుతుండగా పుతిన్ నవ్వుతూ కన్పించారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

**- విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడి**

**అమరావతి,ఆగస్టు16( వెలుతురు):**
వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరోక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. భారత వాతావరణ శాఖ సూచన మేరకు దక్షిణ ఛత్తీస్‌గఢ్ దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని చెప్పింది. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు- కోస్తాలో చెదురుమదురుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. ఇక రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే వీటితో పాటు- ఈదురు గాలులు వీచే అవకాశం ఉందంది. ఈ నేపథ్యంలో మంగళవారం వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు సూచించింది. అలాగే ఈదురు గాలులతోపాటు- భారీ వర్షాల నేపథ్యంలో చెట్ల కింద, శిథిలావస్థలోనున్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండ వద్దని ప్రజలకు రాష్ట్ర విపత్తుల సంస్థ హెచ్చరించింది. అదే విధంగా లోతట్టు- ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అలాగే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఇక అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. సోమవారం అంటే ఆగస్టు 16.. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# నేడు భారత్‌కు రానున్న శుభాన్షు శుక్లా

**- రేపు ప్రధాని మోడీతో భేటీ**



**న్యూఢిల్లీ,ఆగస్టు16( వెలుతురు):**
భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా స్వదేశానికి బయల్దేరారు. నేడు భారత్‌లో ల్యాండ్ కానున్నారు. సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని శుభాన్షు కలిసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. కాగా, ఆక్సియం-4 మిషన్ ద్వారా శుభాన్షు ఇటీవలే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి వచ్చిన విషయం తెలిసిందే. ఐఎస్ఎస్ యాత్ర తర్వాత ఆయన తొలిసారి భారత్‌కు వస్తున్నారు. విమానంలో చిరునవ్వులు చిందిస్తూ దిగిన ఫొటోను శుభాన్షు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. స్నేహితులు, కుటుంబ సభ్యులను కలిసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు- తన పోస్టులో రాసుకొచ్చారు. ఆగస్టు 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నట్లు- పేర్కొన్నాయి. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుక్లా బృందం ఈ ఏడాది జూన్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ మిషన్‌కు శుక్లా చీఫ్ పైలట్‌గా వ్యవహరించారు. ఐఎస్ఎస్‌లో 18 రోజుల పాటూ గడిపిన ఆయన 60కిపైగా శాస్త్రీయ పరిశోధనల్లో పాల్గొన్నారు. శుభాన్షు బృందం జులై 15న క్షేమంగా భూమికి తిరిగి వచ్చింది. ఇక అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారత వ్యోమగామిగా శుభాన్షు శుక్లా రికార్డు క్రియేట్ చేశారు. 1984లో సోవియట్ యూనియన్‌కు చెందిన ఇంటర్‌కాస్మోస్ మిషన్ కింద సూయజ్ టీ--11 వ్యోమనౌకలో భారత వ్యోమగామి రాకేశ్‌శర్మ తొలిసారిగా అంతరిక్షంలోకి వెళ్లి ఎనిమిది రోజులపాటు- ఉండి తిరిగి వచ్చారు. తాజా ప్రయోగంతో 41 ఏండ్ల తర్వాత రోదసిలోకి వెళ్లి వచ్చిన రెండో భారతీయుడిగా శుభాన్షు రికార్డు సృష్టించారు. ఐఎస్-ఎస్‌లోకి వెళ్లి వచ్చిన తొలి భారతీయుడు కూడా ఇతనే కావడం విశేషం.

# జిల్లాలో ఉగ్ర కదలికలతో ఉలిక్కిపాటు

**- ధర్మవరంలో నూర్ మహ్మద్ షేక్ అరెస్ట్**

**- జేషే మహ్మద్ ఉగ్రవాదులతో లింకులు**

**- అరెస్ట్ చేసి జైలుకు తరలించిన పోలీసులు**



**శ్రీసత్యసాయి,ఆగస్టు16( వెలుతురు):**
జిల్లా కేంద్రంలో ఉగ్ర కదలికలతో తెలుగు రాష్ట్రాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. అయితే.. ఇప్పటికే ఉగ్రవాది నూర్ మహమ్మద్ షేక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఏపీలో ఉగ్ర కదలికలపై నిఘావర్గాలు, ఏపీ పోలీసులు ఫోకస్ పెట్టారు. ధర్మవరంలో నూర్ మహమ్మద్ షేక్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మహమ్మద్‌కు పాకిస్తాన్‌కు చెందిన జైషే మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థతో లింకులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) గుర్తించింది. భారతదేశంలో నిషేధించిన ఉగ్రవాద సంస్థలకు చెందిన వాట్సప్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు- ఐబీ అధికారులు పేర్కొన్నారు. ముస్లిం యువతను అతడు ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నట్లు- అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్ కాల్స్ ద్వారా పాకిస్తాన్‌లోని జైషే మహమ్మద్, ఇతరులతో మాట్లాడినట్టు- వివరించారు. అలాగే.. ఏపీలో ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సీమి) ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్న స్టూడెంట్స్‌ను గుర్తించినట్లు- అధికారులు చెప్పారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థలతో ఫోన్‌లో చాటింగ్ చేస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం యువకుడు నూర్ మహ్మద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్ఐఏ, కౌంటర్ ఇంటెలిజెన్స్ నుంచి కీలక సమాచారం అందడంతో అప్రమత్తమైన ధర్మవరం పోలీసులు గత కొద్ది రోజులుగా అతనిపై నిఘాపెట్టారు. గత రాత్రి నూర్ మహమ్మద్ ఇంటి పరిసరాల్లో రెక్కీ నిర్వహించారు. తెల్లవారుజామున డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో పోలీసుల బృందం నిందితుడి ఇంటికి వెళ్లి సోదాలు చేశారు. అతను ధర్మవరం మార్కెట్ సమీపంలోని సల్మాన్ బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడి ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.నూర్.. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థల ప్రభావానికి లోనైనట్టు- పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడు పాక్‌లోని ఉగ్రసంస్థలతో నిత్యం వాట్సాప్ చాటింగ్ చేస్తూ.. సుమారు 30 ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా ఉన్నట్టు- గుర్తించారు. నిందితుడి ఇంట్లో కొన్ని సిమ్ కార్డులు, ఉగ్రవాదాన్ని ప్రేరేపించే పుస్తకాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని విశ్లేషిస్తున్నారు. సిమ్ కార్డులు ఎక్కడ కొనుగోలు చేశాడు? ఎలా వినియోగిస్తున్నాడు? ఒక్కో సిమ్ కార్డుతో ఎన్ని వాట్సాప్ గ్రూప్‌ల్లో సభ్యుడిగా ఉన్నాడు? ఏయే విషయాలపై చాటింగ్ చేశాడన్న విషయాలను పరిశీలిస్తున్నారు. ఫోన్ కాల్స్‌కు సంబంధించిన సమాచారం కోసం ఆయా సిమ్ నెట్ వర్క్ సంస్థల నుంచి సేకరించేందుకు అధికారికంగా మెయిల్స్ పెడుతున్నారు. సింధూర్ ఘటన తరువాత పాకిస్థాన్‌లోని తీవ్రవాద సంస్థలతో నూర్ మహమ్మద్ ఎక్కువ సార్లు మాట్లాడినట్టు సమాచారం. నిందితుడు నూర్ మహమ్మద్‌ను పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించారు. నిందితుడి కుటుంబంలో తగాదాల కారణంగా భార్య.. నూర్ మహమ్మద్‌ను వదిలి వేరుగా ఉంటున్నట్టు- పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలోనే తాడిపత్రిలో ఓ మహిళతో ఇతనికి వివాహేతర సంబంధం ఉన్నట్టుగా గుర్తించిన పోలీసులు.. ఆమె గురించి మధ్యాహ్నం వరకు విచారించారు. పాకిస్థాన్ తీవ్రవాద సంస్థలతో ఆ మహిళకు కూడా ఏమైనా సంబంధాలు ఉన్నాయా?అన్న కోణంలో ప్రశ్నించారు. మార్కెట్ సమీపంలోని సల్మా బిర్యానీ హోటల్ చుట్టపక్కల కూడా నిందితుడికి సంబంధించిన కొంత సమాచారాన్ని పోలీసులు సేకరించారు. నిందితుడు నూర్ పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, సాయంత్రం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కదిరిలో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. నూర్ అహ్మద్‌కు న్యాయమూర్తి ఈ నెల 29 వరకు రిమాండ్ విధించారు. అనంతరం నిందితుడిని ధర్మవరం పోలీసులు కడప జైలుకు తరలించారు. నూర్ మహమ్మద్‌ను విచారిస్తుండగానే ధర్మవరం ఎర్రగుంట కాలనీకి చెందిన రియాజ్ అనే ఆటో డ్రైవర్ భారతదేశానికి వ్యతిరేకంగా, పాక్‌కు అనుకూలంగా వాట్సాప్ డీపీ పెట్టుకున్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. రియాజ్‌ను కుడా అదుపులోకి తీసుకొని డీఎస్పీ కార్యాలయంలో విచారిస్తున్నారు.

అయితే, నూర్ మహమ్మద్‌కు, రియాజ్‌కు సంబంధాలున్నట్లు- పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదనేది సమాచారం. ఏప్రిల్ 25న పది మంది అనుమానితులను నిఘా వర్గాలు గుర్తించాయని ఐబీ అధికారులు తెలిపారు. విజయవాడలో నలుగురు.. శివారు ప్రాంతాల్లో మరో ఆరుగురిని గుర్తించినట్లు- చెప్పుకొచ్చారు. ఏసీ మెకానిక్లుగా, మసీదుల దగ్గర భిక్షాటన, బడ్డీకొట్లలో పనులు చేస్తూ.. సీమీకి పని చేస్తున్నారని పేర్కొన్నారు. జులై 2న అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నట్లు- గుర్తు చేశారు. 30 ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలోనే మకాం వేసి ఉన్నట్లు- ఇం-టె-లిజెన్స్ బ్యూరో గుర్తించినట్లు- చెప్పుకొచ్చారు. రాయచోటిలోని కొత్తపల్లి ప్రాంతంలో ఇళ్లు అద్దెకు తీసుకుని చీరల వ్యాపారం చేసుకుంటున్న సోదరులు అబూబకర్ సిద్ధిఖీ, మహమ్మద్ అలీ తెరవెనక భారీ బాంబు పేలుళ్లకు కుట్ర చేసినట్లు- ఐబీ అధికారులు వెల్లడించారు. 2011లో బీజేపీ అగ్రనేత ఎల్కే ఆడ్వాణీ రథయాత్ర సందర్భంగా మధురైలో బాంబులు పేల్చడానికి కుట్ర చేశారని పేర్కొన్నారు. 1995లో చెన్నైలోని చింతాద్రిపేట హిందూ మున్నాని కార్యాలయంపై బాంబు దాడి కేసులోనూ ఇద్దరు సోదరులు నిందితులుగా ఉన్నట్లు- గుర్తించినట్లు- చెప్పుకొచ్చారు. అదే ఏడాది పార్సిల్ బాంబు పేల్చిన కేసులోనూ.. 1999లో చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూర్, కేరళ ప్రాంతాల్లో వరసగా ఏడు చోట్ల బాంబు పేలుళ్ల జరిపిన ఘటనలో వీరిద్దరూ ప్రధాన నిందితులను తెలిపారు. మే 18న విజయనగరంలో ఉగ్ర కుట్రలను ఏపీ పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. ఇద్దరు ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగిస్తున్న సిరాజ్, సమీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఉగ్ర కార్యకలాపాలపై ఏపీ పోలీసులు , కఊఅ సంయుక్తంగా విచారణ చేపట్టింది. విజయనగరం, హైదరాబాద్, బెంగుళూరు, తమిళనాడులో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు- గుర్తించినట్లు- చెప్పారు. అహీం అనే సంస్థతో ఉగ్ర కార్యకలాపాల విస్తృతికి సిరాజ్, సమీర్ స్లీపర్ సెల్స్ ఏర్పాటు- చేశారని దర్యాప్తు బృందాలు గుర్తించినట్లు- పేర్కొన్నారు. ముస్లిం మహిళలను వివాహం చేసుకున్న ఇతర మతస్తులను హతమార్చాలి అన్నది సిరాజ్ పథకంలో ఓ భాగమని నిర్ధారణలో తేలిందని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదం వైపు యువతను మళ్లేంచేందుకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు- చేశారని ఐబీ అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో భద్రత కట్టుదిట్టం చేస్తున్నట్లు- అధికారులు ప్రకటించారు.

# స్త్రీశక్తి పథకంతో మహిళలకు భరోసా

**- ఆనాడు ఎన్టీఆర్..నేడు బాబు కృషి అభినందనీయం**

**- మాజీమంత్రి పీతల సుజాత వెల్లడి**



**అమరావతి,ఆగస్టు16( వెలుతురు):**
ఆడబిడ్డలను వృద్ధిలోకి తీసుకురావాలన్న సిద్ధాంతమే తెలుగుదేశం పార్టీ విధానమని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఛైర్ పర్సన్, మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ఆనాడు ఎన్టీఆర్ మహిళల హక్కుల కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు డ్వాక్రా అనే విత్తనం వేసి.. నేడు కోటి మంది మహిళలు వాళ్ల కుటుంబాలకు ఆసరగా నిలిచేలా చేశారని ఆమె కొనియాడారు.మహిళలకు అవకాశాలు కల్పిస్తే ఏదైనా చేస్తారని, అద్భుతాలు సృష్టిస్తారని పీతల సుజాత ధీమా వ్యక్తం చేశారు. మహిళల కోసం స్త్రీ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు రాష్ట్ర మహిళల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి మహిళలకు ఇచ్చిన కానుక స్త్రీ శక్తి పథకమని పేర్కొన్నారు. రాఖీ పండుగలా ఈ స్త్రీ శక్తి పథకాన్ని కూడా మహిళలంతా చిరస్థాయిగా గుర్తుపెట్టు-కుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఇలాంటి మంచి పథకాన్ని ప్రవేశపెడితే వైసీపీ పేటీ-ఎం బ్యాచ్ వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి పథకంపై విమర్శలు చేయడం వైసీపీ నాయకుల దిగజారుడు తనానికి నిదర్శనమని విమర్శించారు. వైఎస్ భారతి కూడా జీరో ఛార్జీతో పులివెందుల నుంచి అమరావతికి రావొచ్చని సుజాత చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే చంద్రబాబు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం అందజేశామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి.. ఒక్కరికే పరిమితం చేశారని ఆరోపించారు. అమరావతి అభివృద్ధి, పోలవరం నిర్మాణం, రహదారుల విస్తరణ వంటి అనేక కార్యక్రమాలను వేల కోట్లతో చేపడుతున్నట్లు- పేర్కొన్నారు. రాబోయే నాలుగేళ్లలో మరిన్ని పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తామని సుజాత స్పష్టం చేశారు

# ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు వాగు

## అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఆగస్టు16( వెలుతురు):**
భారీ వర్షాలతో మున్నేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో జిల్లా ఉన్నతాధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రమత్తం చేశారు. శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. మున్నేటికి ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో మున్నేరుకి వరద ముప్పు పొంచి ఉందని తెలిపారు. ప్రస్తుతం ఖమ్మం వద్ద మున్నేరు 14.50 అడుగుల మేర ప్రవహిస్తోందని పేర్కొన్నారు. జిల్లా అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ముందస్తు.. సహాయక చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు- చేయాలని మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ముంపుకు గురి అయ్యే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో ఉన్న 12 డివిజన్లలోని ప్రజలకు అవసరమైన అత్యవసర తక్షణ సహాయం అందించాలని జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులను ఆదేశించారు. మంత్రి తుమ్మల ఆదేశాలతో అధికార యంత్రాంగం చర్యలు మొదలుపెట్టింది. మున్నేరు పరివాహక ప్రాంతంలోని డివిజన్లో పర్యటిస్తూ.. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేస్తున్నారు అధికారులు. ఖమ్మం వద్ద ఉధృతంగా మున్నేరు ప్రవహిస్తుంది. 15 అడుగుల మేర ప్రవాహం కొనసాగుతున్నట్లు- అధికారులు తెలుపుతున్నారు. 16 అడుగులకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ఈ రాత్రికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు- అధికారులు చెబుతున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో ముంపుకు గురయ్యే ప్రాంతాలను శాటిలైట్ ద్వారా గుర్తించి ఆయా ప్రాంతాల్లో అధికార యంత్రాంగం సహాయక చర్యలు ప్రారంభించింది.



# యూరియా బాధలు పట్టని సర్కార్

**- ఎక్స్ వేదికగా వీడియో షేర్ చేసిన హరీష్ రావు**



**హైదరాబాద్ ,ఆగస్టు16( వెలుతురు):**
రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం అన్నదాతలు పడరాని పాట్లు- పడుతున్నా..ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని బిఆర్ఎస్ మండిపడింది. ఒక్క యూరియా బస్తా కోసం నిద్రాహారాలు మాని రైతులు వ్యవసాయ సహకార సంఘాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. భారీ క్యూలైన్‌లో నిల్చున్నప్పటికీ చివరి రైతు వరకు దొరుకుతుందో.. దొరకదో తెలియని అయోమయ పరిస్థితి. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. మహబూబాబాద్ జిల్లా గూడూరులో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థకు సంబంధించిన వీడియోను మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ముసురు వానలో రైతన్నలు రోడ్డెక్కితే.. రేవంత్ సర్కార్ మాత్రం మొద్దు నిద్రలో ఉందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరతతో అన్నదాత కలత చెందుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. యూరియా కూడా సరఫరా చేయలేని దిక్కుమాలిన ప్రజాపాలన ఇది అని నిప్పులు చెరిగారు. అభయహస్తం కాదు.. రైతన్నల పాలిట భస్మాసుర హస్తం అయ్యింది కాంగ్రెస్ ప్రభుత్వం అని హరీశ్‌రావు విమర్శించారు.

# కేసు పేరుతో మహిళకు వేధింపులు

**- ఎస్ రాజశేఖర్‌ను సస్పెండ్ చేసిన ఎస్పీ**

**ధర్మవరం,ఆగస్టు16( వెలుతురు):**
ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన బాధ్యతాయుత పదవిలో ఉన్నాడు. అలాంటి వ్యక్తి బుద్ధి గడ్డి తింది. ఓ మహిళను లైంగిక వేధింపులకు గురి చేయడంతో ఉన్న పోలీస్ ఉద్యోగం కాస్తా ఊడింది. ఈ ఘటన శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా అడవి బ్రాహ్మణ పల్లి తండాకు చెందిన గిరిజన మహిళ వ్యక్తిగత కారణాలతో భర్తతో విడాకులు తీసుకుంది. విడాకుల సందర్భంగా తనకు తగిన న్యాయం జరగలేదని పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. ఈ క్రమంలో కానీపట్నం ఎస్ఐ రాజశేఖర్‌కు తన గోడు వెల్లబోసుకుంది. ఐతే అతను సానుకూలంగా స్పందించకపోగా.. ఆమెపై కన్నేశాడు. ఈ క్రమంలోనే ఫోన్ నంబర్ తీసుకున్నాడు. కేసు వంకతో ఆమెకు నిత్యం ఫోన్ చేసేవాడు రాజశేఖర్. అందులో అసభ్యంగా మాట్లాడేవాడు. లైంగికంగా లొంగదీసుకునేందుకు ప్రయత్నించాడు. ఏకంగా పలుమార్లు వీడియో కాల్ కూడా చేశాడు. ప్రయివేట్ పార్ట్స్ చూపిస్తూ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో అసలే వ్యక్తిగత సమస్యలతో ఇబ్బంది పడుతున్న మహిళకు మరింత నరకం కనిపించింది. దీంతో పోలీస్ ఉన్నతాధికారులకు విషయం తెలిపింది. ఎస్పై రాజశేఖర్ అసభ్య వీడియో కాల్ రికార్డ్స్ కూడా వారి ముందు ఉంచింది. ఈ విషయంపై స్పందించిన జిల్లా ఎస్పీ వీ.రత్న ఎస్ఐ రాజశేఖర్‌ను వెంటనే వీఆర్‌కు తరలిస్తూ ఆదేశాలు జారీ చేశారు. శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో ఎస్ఐ రాజశేఖర్ అసభ్య వ్యవహారం నిజమని నిగ్గుతేలింది. ఫలితంగా ఆయన ఉద్యోగం ఊడింది. అంతే కాదు భార్యతో గొడవ పడి.. కానీపట్నంలోనే ఓ అద్దెభవనంలో బస చేస్తూ ఈవ్ టీజరయ్యాడని ప్రచారం జరుగుతోంది. ఎస్పీ రత్న.. సకాలంలో స్పందించి ఓ మహిళకు జరిగిన అన్యాయంపై పోలీసులను కూడా వదిలిపెట్టనందుకు శ్రీసత్యసాయి జిల్లా ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# రజనీకాంత్ స్టైలే వేరు

- నేటి తరంలోనూ రజనీకి అభిమానులు
- అభినందనలు తెలిపిన పవన్ కళ్యాణ్



**అమరావతి,ఆగస్ట్16( వెలుతురు):**
అగ్ర కథానాయకుడు రజనీకాంత్ సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీ డిప్యూటీ– సీఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు చెప్పారు. నటుడిగా స్వర్ణోత్సవ సంబరాలు చేసుకుంటున్న రజనీకాంత్ మరిన్ని విభిన్న పాత్రలతో సినీ ప్రియులను మెప్పించాలని ఆకాంక్షించారు. వెండితెరపై 'సూపర్ స్టార్ రజని' అని –టైటిల్ కనిపించగానే థియేటర్లు ఏ విధంగా మార్మోగుతాయో పలుమార్లు చెన్నైలో చూశా. తరాలు మారుతున్నా సినీ ప్రియుల్లో ఆ ఆనందోత్సాహాల వన్నె తగ్గలేదు. ఆ స్థాయి అభిమానులను దక్కించుకున్న కథానాయకుడు రజనీకాంత్. నటుడిగా అయిదు దశాబ్దాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. సినీ జీవితంలో స్వర్ణోత్సవం చేసుకుంటున్న సూపర్ స్టార్ రజనీకాంత్‌కి హృదయ పూర్వక శుభాకాంక్షలు. ఆయన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. ప్రతినాయక పాత్ర పోషించినా, కథానాయకుడిగా మెప్పించినా తనదైన స్టైల్‌ను చూపించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారు.ఆయన నడకలో, సంభాషణలు పలకడంలో, హావభావ విన్యాసంలో ప్రత్యేకతను చూపిస్తారు. రజనీకాంత్‌స్టైల్‌కి నవతరం ప్రేక్షకుల్లోనూ అభిమానులున్నారు. నటు–డిగా స్వర్ణోత్సవ సంబరాలు చేసుకుంటున్న రజనీకాంత్ మరిన్ని విభిన్న పాత్రలతో సినీ ప్రియులను మెప్పించాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు అందించాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

# పాక్ వరద మృతులు 321కి చేరిక



**లాహోర్,ఆగస్ట్16( వెలుతురు):**
పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ల్లోని పలు ప్రాంతాల్లో వరదలకు మృతి చెందిన వారి సంఖ్య 321కు చేరుకుంది. ఈ విషయాన్నిఅక్కడి అధికారులు వెల్లడించారు. గల్లంతయిన వారి కోసం గాలిస్తున్నారు. గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా రెండు రోజుల్లోనే 321 మంది మరణించినట్లు– అధికారులు వెల్లడించారు. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోనే 307 మంది చనిపోయినట్లు– ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం పేర్కొంది. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని లోయర్ దిర్, బజౌర్, అబోటాబాద్, జబ్రారీతో సహా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో భారీ విధ్వంసం చోటు–చేసుకుంది. వరదల కారణంగా పదుల సంఖ్యలో భవనాలు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కూడా కొట్టు–కుపోయాయి. అనేక రహదారులు జలదిగ్బంధమయ్యాయి. వరదల్లో అనేక మంది గల్లంతైనట్లు– అధికారులు వెల్లడించారు. వీరికోసం ముమ్మర గాలింపు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు దాదాపు 2వేల మందితో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు– అధికారులు వెల్లడించారు. మరోవైపు పాక్‌లోని మరిన్ని ప్రాంతాలకు భారీ వర్ష ముప్పు ఉన్నట్లు– స్థానిక వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

# ముంబైలో భారీ వర్షంతో అతలాకుతలం

- వరదలు ముంచెత్తడంతో జనం అవస్థలు



**ముంబై,ఆగస్ట్16( వెలుతురు):**
భారీ వర్షాలు ముంబైని ముంచెత్తుతున్నాయి.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శనివారం వరదలు ముంబైని అతలాకుతలం చేశాయి. వీధులు, రోడ్లపై భారీ ఎత్తున వరద నీరు నిల్చిపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. విక్రోలీ పార్క్ సైట్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఇద్దరు చనిపోయారు.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. శనివారం భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మరోవైపు భారీ వర్షాలతో లాతోర్ జిల్లా వణికిపోతోంది. జిల్లాలో టెర్నా, మంజారా నదుల ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వరద ముంపు ఉన్నందున నది పరివాహక ప్రాంతంలో ప్రజలు వెంటనే ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లాతూర్ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఒఃఉ) రెడ్ అలర్ట్ జారీ జారీ చేసింది. శనివారం తెల్లవారుజామున 1 గంటల నుంచి4 గంటల మధ్య ముంబైలో అత్యంత భారీ వర్షపాతం నమోదైంది.పశ్చిమ ,తూర్పు శివారు ప్రాంతాలు అత్యధికంగా దెబ్బతిన్నాయి. పశ్చిమాన మరోల్ ఫైర్ స్టేషన్ లో 207 మిమీ,నారియల్వాడి స్కూల్, శాంటాక్రూజ్ 202 మిమీ వర్షపాతం నమోదు అయింది. తూర్పున ఠాగూర్ నగర్ స్కూల్, విఖ్రోలి 196 మిమీ , బిపి ఆఫీస్, విఖ్రోలి195 మిమీ లవర్షం కురిసింది.

# శ్రీరాం సాగర్‌కు భారీగా వరదనీరు

- జలకళ సంతరించుకున్న ప్రాజెక్ట్

**నిజామాబాద్,ఆగస్ట్16( వెలుతురు):**
ఉత్తర తెలంగాణ వరప్రదాయనిగా పేరుగాంచిన శ్రీ రామసాగర్ ప్రాజెక్టు కు భారీగా వరదనీరు చేరుతోంది. ఎగువన గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మహారాష్ట్ర బాబ్లీ, విష్ణుపురి, మాలేగావ్ ప్రాజెక్టుల నుండి ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 89,466 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 80.501 టిఎంసిలు ఉండగా శనివారం మధ్యాహ్నం వరకు 1082.30 అడుగులు 51.659 టిఎంసిలుగా ఉందని ప్రాజెక్టు ఎ.ఇ.ఇ.రవి తెలిపారు. ప్రధాన కాలువ కాకతీయ ద్వారా 4,625 వేల క్యూసెక్కులు, మంచి నీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 541 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టు నీటిమట్టం 1081.10 అడుగులు 48.071 టిఎంసిలుగా ఉందని.. జూన్ 1 నుండి ఇప్పటివరకు 46.930 టిఎంసిల నీరు వచ్చి చేరిందని వివరించారు. జూన్ 1 నుండి ఇప్పటివరకు 8.937 టిఎంసీ ల నీరు విడుదల చేశామని అధికారులు



తెలిపారు.గోదావరి నదిలో భారీగా వరద నీరు పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి నదీ పరిసర ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే పశువుల కాపర్లు, గొర్ల కాపరులు, చేపలు పట్టేవారు, రైతులు మరియు సామాన్య జనం గోదావరి నదిని దాటే ప్రయత్నాలు చేయవద్దని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.చక్రపాణి తెలిపారు.

# పోరాట యోధులను విస్మరించిన మోడీ

- స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర లేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**విజయవాడ,ఆగస్ట్16( వెలుతురు):**
స్వాతంత్య్ర సంగ్రామంలో ప్రాణాలర్పించిన ఆజాద్ చంద్రశేఖర్, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు పేర్లు ప్రధాన ప్రస్తావించకపోవడం శోచనీయం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. స్వాతంత్య్ర సంగ్రామంలో కాంగ్రెస్, సీపీఐదీ తిరుగులేని పాత్ర.. ఆర్‌ఎస్ఎస్ కు స్వాతంత్ర్య సంగ్రామంతో ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. ఆర్ఎస్ఎస్ ను ప్రధాన మంత్రి మోడీ ప్రశంసించడం సీపీఐ ఖండిస్తోంది.. దేశంలో పేదరికం తగ్గిందని ప్రధాని ప్రస్తావించారు.. అయితే, 50 కోట్ల మంది వరకు బియ్యం, గోధుమలు, ఉచిత రేషన్ కార్డుల ద్వారా ఎందుకు పంపిణీ చేస్తున్నారు అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 47.72 అడుగుల మేర కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి అని డిమాండ్ చేశారు. 196 టీ–ఎంసీల నీరు నిల్వ చేయాలి.. పోలవరం నిర్వాసితులకు పరిహారం పంపిణీ, ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి అని సీపీఐ రామకృష్ణ కోరారు. ఇక, పోలవరం– బనకచర్ల ప్రాజెక్టులో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం చేసుకుంటే సీపీఐ చూస్తూ ఊరుకోదు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



తేల్చి చెప్పారు. పోలవరం– బనకచర్ల ప్రాజెక్టు ఒక అంబక్ ప్రాజెక్ట్.. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకం ప్రారంభించడం సీపీఐ స్వాగతిస్తోంది.. ఆర్టీసీలో 3 వేల బస్సులు కొనుగోలు చేసి మహిళలకు ఉచిత ప్రయాణం సాఫీగా సాగేలా చేయాలి అని కోరారు. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ప్రభుత్వ రంగ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలి.. అలాగే, ప్రభుత్వ ఆధ్వర్యంలోని కళాశాలలో నాణ్యమైన విద్య బోధించేలా చర్యలు తీసుకోవాలి సీపీఐ రామకృష్ణ డిమాండ్ చేశారు.

# లాపతా ఓట్ అంటూ రాహుల్ పోస్ట్

- నిమిషం నిడివితో ఎక్స్‌లో వీడియో
- నేటినుంచి బీహార్‌లో ఓట్ అధికార్ యాత్ర
- సెప్టెంబర్ 1 వరకు బీహార్ అంతటా రాహుల్ పర్యటన

**న్యూఢిల్లీ/పాట్నా,ఆగస్ట్16( వెలుతురు):**
ఓట్ చోరీకి పాల్పడుతోందంటూ ఎన్నికల కమిషన్‌పై వరుస విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత



రాహుల్ గాంధీ మరోసారి ఓట్ల చౌర్యంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హాస్యం, వ్యంగ్యం మేళవించిన స్పూఫ్ వీడియోను శనివారంనాడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎన్నికల సంఘం బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా, ప్రజల ఓటు– హక్కుపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆదివారం 'ఓటు– అధికార్ యాత్ర'ను చేపట్టనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత అఖిలేష్ ప్రసాద్ సింగ్ తెలిపారు. ఆయన శనివారం పాట్నాలో జరిగిన మీడయా సమావేశంలో మాట్లాడుతూ.. బీహార్‌లో ఓటు– అధికార్ యాత్రను ససారం నుంచి రాహుల్ గాంధీ ప్రారంభించనున్నారు. ఈ యాత్ర బహుశా సెప్టెంబర్ 1న ముగియనుంది. ఈ యాత్ర ముగిసేవరకు రాహుల్ రాష్ట్రంలోనే ఉండనున్నారు. ఈ యాత్ర కోసం ముందుగానే అనుమతులు తీసుకున్నాము. ఈ యాత్ర రాష్ట్రంలోని 25 జిల్లాలను కవర్ చేస్తుంది. ఆగస్టు 20, 25, 31 తేదీల్లో యాత్రకు విరామం. సెప్టెంబర్ 1 పాట్నాలో జరిగే ర్యాలీతో ఈ యాత్ర ముగుస్తుంది. ఈ యాత్రలో బీహార్ అసెంబ్లీ ప్రతిపక్షనేత తేజస్వియాదవ్ పాల్గొంటారు. ఆర్‌జెడితోపాటు– ఇండియా బ్లాక్‌లోని ఇతర పార్టీలైన వామపక్ష పార్టీల నేతలు కూడా పాల్గొనున్నారని ఆయన అన్నారు. బిహార్ ఓటర్ల జాబితాలో లోపాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా 'లాపతా ఓటు–' అనే –టైటిల్‌తో వీడియోను ఎక్స్‌లో శనివారం విడుదల చేశారు. నిమిషం నిడివి ఉన్న ఆ వీడియోలో.. పోలీసు స్టేషన్‌లో ఓ వ్యక్తి తన ఓటు–చోరీ చేశారని, ఇంకా లక్షల ఓట్లు– చోరీ అయ్యాయని అధికారులకు ఫిర్యాదు చేస్తారు. పోలీసు సిబ్బంది చెక్ చేసి అందులో తమ ఓట్లు– కూడా గల్లంతుకావడంతో నిర్ఘాంతపోతారు. అలా ఆ వీడియా ముగుస్తుంది. దీనిని రాహుల్ తన అధికారిక ఎక్స్‌లో పోస్టు చేస్తూ.. ఓటర్లందరూ చైతన్యంతో ఓ ఉద్యమంలా ముందుకు సాగాలి. మీ ఓటు– చోరీ అయితే మీ ప్రాథమిక హక్కు చోరీ అయినట్లే అని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా మనమందరం ఉద్యమంగా పోరాడి మన హక్కులను కాపాడుకుందామన్నారు. ఓట్ల చోరీ అనేది 'దూ ఆర్ డై' సమస్యగా కాంగ్రెస్ పేర్కొంది. ఓట్లు– గల్లంతైన వారి కోసం ఓ వెబ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. అందులో పోల్ ప్యానెల్ నుంచి ఓట్ల గల్లంతుకు వ్యతిరేకంగా నమోదు చేసుకోవడానికి, అధికారుల నుంచి జవాబుదారీతనం కోరడానికి, డిజిటల్ ఓటరు జాబితాల డిమాండ్‌కు మద్దతు తెలియజేయడానికి ఆ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది.

# బలహీనపడ్డ అల్పపీడనం

**విశాఖపట్నం,ఆగస్ట్16( వెలుతురు):**
అల్పపీడనం బలహీనపడడంతో ఆంధ్రాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. దీంతో జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ఒడిశా–ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య అల్పపీడనం బలహీనపడిందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. విశాఖ మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతంలో రుతుపవనాల ద్రోణి కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో ఆదివారం ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని



తెలిపారు. ఉత్తరాంధ్రలోని అన్ని పోర్టుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు– చెప్పారు. ఈ రోజు పార్వతీపురం మన్యం జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్, ఆదివారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయనున్నట్లు– విశాఖ వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు.

## ఉచిత బస్స్ టికెట్‌తో సెల్ఫీ పంపండి: లోకేశ్



**అమరావతి,ఆగస్ట్16( వెలుతురు):**
రాష్ట్రంలో మహిళా సాధికారత ఎలా ఉందో ప్రపంచానికి చాటుదామని విద్య, ఐటీ– శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఉచిత బస్సు టికెట్‌తో సెల్ఫీ దిగి ట్యాగ్ చేయాలని మహిళలను కోరారు. సురక్షితంగా.. గౌరవంతో కూడిన ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మహిళకు కల్పిస్తోందని వెల్లడించారు. మహిళలకు కల్పిస్తున్న ప్రతి ఉచిత బస్సు టికెట్ ఆశ, స్వేచ్ఛ, గౌరవంతో కూడినదని వ్యాఖ్యానించారు. ఇది స్వాతంత్య్రం, సమానత్వంతో కల్పించిన అవకాశం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్త్రీ శక్తి, ఉచిత బస్సు ప్రయాణ పథకంతో మహిళలకు సాధికారత కల్పించడం గర్వంగా ఉందని మంత్రి లోకేశ్ అన్నారు.

# డివైడర్‌ను ఢీకొన్న కారు

- భారీగా బయటపడ్డ గంజాయి

**హైదరాబాద్,ఆగస్ట్16( వెలుతురు):**
రంగారెడ్డి జిల్లా విజవాడ హైకేలో ఉన్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాటసింగారం వద్ద కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదానికి గురైన కారులో 16 కేజీల గంజాయి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మహబూబాబాద్‌కు చెందిన భూక్యా నాయక్ ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తుండగా ప్రమాదం జరిగినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుడు భూక్యా నాయక్‌తో పాటు– సెల్‌ఫోన్, 16 కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్టు– పోలీసులు తెలిపారు.

# క్రమశిక్షణా కమిటీకి రాజగోపాల్ వ్యవహారం: పిసిసి



**హైదరాబాద్,ఆగస్ట్16( వెలుతురు):**
మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం క్రమశిక్షణా కమిటీ చూసుకుంటుందని, ఆయన ఏ ఉద్దేశంతో అన్నారో తెలుసుకుంటామని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారని మునుగోడు నియోజక వర్గం అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా వివక్ష చూపిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పరిశీలించాలని క్రమశిక్షణ కమిటీని ఆదేశించామని, రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని తెలియజేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో త్వరలో స్పష్టత వస్తుందని, మార్వాడీలు మనలో ఒకరని, వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే తెలంగాణ ప్రాజెక్టుల గురించి టిడిపి ఆలోచించడం లేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం నుంచి టిడిపి బయటికి రావాలని అన్నారు. అద్దంకి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. తమ వాట కోసం.. తాము కొట్లాడితే మీకు వ్యతిరేకం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఆంధ్రా నీటి పంపకాల్లో బిజెపి నష్టం కలిగిస్తోందని అద్దంకి దయాకర్ విమర్శించారు.

# హాస్టల్ నిర్వాహకుడిపై మహిళల దాడి

**హైదరాబాద్,ఆగస్ట్16( వెలుతురు):**
మాదాపూర్‌లో ఉమెన్స్ హాస్టల్ నిర్వాహకుడిపై మహిళలు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. మాదాపూర్ ఇమేజ్ గార్డెన్ రోడ్డులో అర్ణవ్ ప్లాజాలో ఉన్న ఎన్‌పీపీ ఎగ్జిక్యూటివ్ ఉమెన్స్ హాస్టల్‌లో 16 ఏళ్ల బాలిక ఉంటోంది. బాలికపై హాస్టల్ నిర్వాహకుడు సత్య ప్రకాష్ లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ కొందరు మహిళలు ఆందోళనకు దిగారు. పూలకుండీలను ధ్వంసం చేసిన మహిళలు, సత్యప్రకాష్‌పై దాడికి దిగారు. హాస్టల్‌లో గొడవ జరుగుతోందని డయల్ 100కు సమాచారం రావడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితి అదుపు చేశారు. దాడికి పాల్పడిన మహిళలతో పాటు–, సత్య ప్రకాష్‌ను మాదాపూర్ పీఎస్‌కు తరలించారు. మైనర్ బాలికపై లైంగిక దాడి జరగలేదని, కావాలనే పథకం ప్రకారం తనపై దాడి చేశారని సత్య ప్రకాష్ ఆరోపించారు. అయితే కేసును విచారి స్తున్నామని పోలీసులు తెలిపారు.



# చిరంజీవి బర్త్‌డేకు విశ్వంభర టీజర్ విడుదల?

## ఆసక్తిగా ఎదురు చూస్తున్న అభిమానులు

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. అందులో విశ్వంభర భారీ బడ్జెట్ తో వస్తోంది. వశిష్ట డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాను సోషియో ఫాంటసీ థ్రిల్లర్ గా తీసుకొస్తున్నారు. జెట్ స్పీడ్ తో షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే రిలీజ్ కాబోతున్న ఈ సినిమా నుంచి భారీ అప్డేట్ రాబోతోంది. మూవీ టీజర్ ను ఇప్పటికే కట్ చేసినట్టు- తెలుస్తోంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్టు- తెలుస్తోంది. త్వరలోనే రిలీజ్ డేట్ ను ప్రకటించబోతున్నారు. ఇప్పటికే ఆర్ ఆర్ కూడా కంప్లీట్ అయిపోయిందంట. గతంలో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ పై కొన్ని విమర్శలు వచ్చాయి. వీఎఫ్ ఎక్స్ వీక్ గా ఉందనే ప్రచారం జరిగింది. అందుకే ఈసారి ఎలాంటి విమర్శలకు తావు లేకుండా చూస్తున్నారంట. వశిష్ట అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే మెగా ఫ్యాన్స్ మెచ్చే విధంగా టీజర్‌ను కట్ చేయించినట్టు తెలుస్తోంది. చిరంజీవి కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో వస్తున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. త్రిష, అషికా రంగనాథ్ హీరోయిన్లుగా చేస్తున్నారు. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ సినిమాలో చిరంజీవి పాత కాలం నాటికి వెళ్లే సీన్స్ కూడా ఉంటయాంటున్నారు. వింటేజ్ చిరు లుక్ గురించి ఇప్పటికే చర్చ జరుగుతోంది. కాబట్టి చిరంజీవి లుక్ ఈ సినిమాలో మరింత ఇం-టె-స్ట్ ను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఈ టీజర్ తో మెగా ఫ్యాన్స్ ను సంతృప్తి పరిచేసి మూవీపై భారీగా అంచనాలు పెంచాలని చూస్తున్నారు. సెప్టెంబర్ లోనే మూవీ రిలీజ్ అవుతుందనే టాక్ మొన్నటి వరకు నడిచింది. కానీ ఇప్పుడు అక్టోబర్ కు షిఫ్ట్ అయిందనే వాదనలు వినిపిస్తున్నాయి.






# త్వరలో ఆఫ్రికాకు రాజమౌళి

## అక్కడే కీలక సన్నివేశాల చిత్రీకరన

మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాపై ఆసక్తికరమైన అప్‌డేట్స్ వచ్చాయి. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి స్వయంగా ఈ సినిమా గురించి కొన్ని విషయాలు వెల్లడించారు. కేవలం కొన్ని ప్రెస్ మీట్‌లు లేదా అప్‌డేట్స్ ద్వారా సినిమా కథాంశాన్ని పూర్తిగా వివరించలేమని రాజమౌళి స్పష్టం చేశారు. సినిమా గురించి అప్పటికప్పుడు ఏది అప్‌డేట్ ఇవ్వాలో అదే ఇస్తామని తెలిపారు. దక్షిణాఫ్రికాలో ఇటీవల జరిగిన అల్లర్ల కారణంగా అక్కడ ప్లాన్ చేసిన షూటింగ్ వాయిదా పడింది. సెప్టెంబర్ రెండో వారంలో సౌత్ ఆఫ్రికాలో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. సౌత్ ఆఫ్రికా షెడ్యూల్ ఆలస్యం కావడంతో, ఈ మధ్య హైదరాబాద్‌లోనే హీరోయిన్‌తో కొన్ని కీలక సన్నివేశాలను షూట్ చేశారు. ప్రస్తుతం షూటింగ్స్ నిలిచిపోయిన నేపథ్యంలో సౌత్ ఆఫ్రికా షెడ్యూల్ కోసం బిజీగా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో మునిగి పోయారు రాజమౌళి. ఈ క్రమంలో బాడీ ట్రాన్స్ఫర్మేషన్ మీద మహేష్ ఫోకస్ పెట్టాడు. ఈ సినిమా మహేష్ బాబు కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, రాజమౌళి స్థాయికి తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కుతుందని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబుతో పాటు- పృథ్వీ రాజ్ సుకుమారన్ తో పాటు- ప్రియాంక చోప్రా కీలక పాత్రలలో నటిస్తున్నారు.

# బెంగాల్ ఫైల్స్ ట్రైలర్ విడుదల

ది కశ్మీర్ ఫైల్స్', 'ది తాష్కెంట్ ఫైల్స్' వంటి వివాదాస్పద చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం ది బెంగాల్ ఫైల్స్. ఈ సినిమాను అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది. అభిషేక్ అగర్వాల్, పల్లవి జోషి సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, గోవింద్ నామ్‌దేవ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు.




# త్వరలోనే నాగ్ కొత్త సినిమా ప్రకటన


చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణ సరికొత్త రికార్డులు సృష్టిస్తుంటే.. కింగ్ నాగార్జున మాత్రం గట్టి కంబ్యాక్ కోసం కష్టపడుతున్నారు. 2022లో వచ్చిన బంగార్రాజు తర్వాత నాగ్ పెద్దగా హిట్ చూడలేదు. బ్రహ్మాస్త్ర హిట్ అయినప్పటికీ అది రణబీర్, అమితాబ్ బచ్చన్ ఖాతాలోకి చేరిపోయింది. ఆ తర్వాత వచ్చిన ది గోస్ట్ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టగా.. నా సామి రంగా పర్లేదనిపరచింది. కింగ్ హీరోగా కాస్త బ్రేక్ ఇచ్చి.. సపోర్టింగ్ అండ్ స్పెషల్ రోల్స్‌కు షిఫ్టయ్యారు. నాగార్జున ఇటీ-వలే ధనుష్ 'కుబేర'తో ప్రేక్షకుల్ని అలరించారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ఈ సినిమాలో నాగ్ విలన్‌గా నటించారు. అయితే కింగ్ కొత్త సినిమా విషయంలో మాత్రం క్లారిటీ- రావడం లేదు. కానీ ఇప్పటికే నాగ్ కొత్త సినిమాపై గట్టిగా కసరత్తులు చేస్తున్నారు. ఈసారి ఆయన తమిళ దర్శకుడితో మైల్‌స్టోన్ మూవీ చేయబోతున్నట్టుగా తెలుస్తోంది. 'రా.కార్తీక్' దర్శకత్వంలో నాగార్జున సినిమా చేయబోతున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను 'కింగ్ 100' వర్కింగ్ -టైటిల్‌తో మొదలు పెట్టబోతున్నారు. తాజా అప్డేట్ ప్రకారం.. ఈ చిత్రాన్ని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 29న ప్రకటించనున్నట్లు సమాచారం. దీనికోసం ఇప్పటికే ఓ లుక్‌ను కూడా సిద్ధం చేసినట్లు- తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోను ప్రారంభించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను నాగ్ తమ సంస్థలోనే స్వయంగా నిర్మించనున్నారట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలుకానుందని సమాచారం.



# రామయాణంలో నాది హనుమత్ పాత్ర

## చాలి చిలిపిగా, అల్లరిగా ఉంటుందన్న సన్నీ డియోల్

బాలీవుడ్ నుంచి మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్టలలో ఒకటి 'రామాయణ' దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రం 45కి పైగా భాషల్లో విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించబోతుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తుంది. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు నటించబోతున్నారు. అయితే ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు నటుడు సన్నీడియోల్. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోల్ చాలా సరదాగా అల్లరిగా ఉండడంతో పాటు- ఉత్సహాంగా ఉంటుందని సన్నీ తెలిపాడు. నా పాత్రకు సంబంధించి త్వరలోనే షూటింగ్ ప్రారంభంకానుంది. ఇలాంటి పాత్రలు చాలా సవాలుతో కూడుకున్నవని అందులో పూర్తిగా లీనమై నటించాలని సన్నీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచడానికి చిత్రబృందం నిరంతరం శ్రమిస్తోందని ఆయన తెలిపారు. హాలీవుడ్ సినిమాల స్థాయికి ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమాను రూపొందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని ఎన్నిసార్లు తెరకెక్కించినా కొత్తగానే ఉంటుందని, ఈ సినిమాతో ప్రపంచమంతా రామాయణం





గొప్పతనాన్ని మరోసారి తెలుసుకుంటుందని సన్నీ డియోల్ ధీమా వ్యక్తం చేశారు.

# పూజా హెగ్డేను వెంటాడుతున్న బ్యాడ్‌లక్

ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలిగిన పూజా హెగ్డే, ప్రస్తుతం సరైన హిట్ కోసం కష్టాలు పడుతున్నారు. 'అల వైకుంఠపురములో' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆమె నటించిన చాలా సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయాయి. దీంతో ఆమెకు బ్యాడ్ లక్ వెంటాడుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి.అల వైకుంఠపురములో' తర్వాత పూజా నటించిన సినిమాలు వరుసగా నిరాశ పరిచాయి. అఖిల్‌తో చేసిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', ప్రభాస్‌తో చేసిన 'రాధే శ్యామ్', విజయ్‌తో చేసిన 'బీస్ట్', రామ్ చరణ్‌తో చేసిన 'ఆచార్య' సినిమాలు బాక్సాఫీస్ వద్ద చతికిలపడ్డాయి. తెలుగులోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఆమెకు కలిసి రాలేదు. 'సర్కస్' , దేవా, 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' చిత్రాలు కూడా విమర్శకుల నుంచి, ప్రేక్షకుల నుంచి ప్రతికూల స్పందన పొందాయి. అంతేకాకుండా, తమిళ నటుడు సూర్యతో చేసిన 'రెట్రో' కూడా నిరాశనే మిగిల్చింది. తాజాగా, ఆమె స్పెషల్ సాంగ్ చేసిన 'కూలీ' చిత్రం కూడా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఈ సినిమాలో 'మోనికా' పాటలో ఆమె డ్యాన్స్ అందరినీ మెప్పించినప్పటికీ, సినిమాలో ఆ పాట ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడంతో ప్రేక్షకులు నిరాశపడ్డారు. దీనిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా జరిగింది. ఈ వరుస పరాజయాలు పూజా హెగ్డే కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తిరిగి ఫామ్‌లోకి రావడానికి ఆమెకు ఒక పెద్ద హిట్ ఎంత అవసరమో ఈ పరాజయాలు స్పష్టం చేస్తున్నాయి. ఆమె చేతిలో విజయ్ జన నాయగన్ సినిమా ఒక్కటే ఉంది. మరి భవిష్యత్తులో ఆమె లక్ ఎలా ఉంటుందో చూడాలి.




# నాకు జరిగిన అన్యాయాలను త్వరలోనే వెల్లడిస్తా... ఆరోజు పెద్ద యుద్ధమే జరుగుతుంది: ఉదయభాను

ఒకప్పుడు బుల్లితెరపై యాంకర్ గా ఒక వెలుగు వెలిగిన ఉదయభాను ఆ తర్వాత కాస్త నెమ్మదించారు. పెళ్లి చేసుకుని, పిల్లలకు జన్మనిచ్చిన ఉదయభాను చాలా కాలంపాటు కుటుంబానికే అంకితమయ్యారు. ఇప్పుడు తాజాగా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. తాజాగా ఓ ప్రమోషన్స్ ఈవెంట్, మరో ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఆమె మాట్లాడుతూ... ఇండస్ట్రీలో యాంకర్ లకు ఎదురవుతున్న అసమానతలపై గళమెత్తారు. ఇండస్ట్రీలోని కొన్ని గ్రూపులు యాంకరింగ్ ను సిండికేట్ గా మార్చేశాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆమె చేసిన వ్యాఖ్యలపై కొందరు విమర్శలు కూడా గుప్పిస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఉదయభాను మాట్లాడుతూ... ఈ రంగంలో తనకు ఎదురైన అనుభవాలే తనను అలా మాట్లాడేలా చేశాయని చెప్పారు. ఎన్నోసార్లు ఈవెంట్ కు రెడీ అయి వెళ్లిన తర్వాత... ఆ ఛాన్స్ మరొకరికి వెళ్లిందని తెలిసి వెనక్కి వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఆమె తెలిపారు. కొన్ని ఛానల్స్ తన డేట్స్ తీసుకుని... ఆ తర్వాత తనకు సమాచారం కూడా ఇవ్వకుండానే ప్రాజెక్ట్ నుంచి తీసేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'హయ్యెస్ట్ పెయిడ్ యాంకర్' అంటూ తనకు ట్యాగ్ వేసినప్పటికీ... వాస్తవ పరిస్థితి వేరని ఆమె అన్నారు.

తనకు ఇచ్చిన చెక్కులు ఎన్ని బౌన్స్ అయ్యాయో తమ ఇంటికి వచ్చి చూస్తే తెలుస్తుందని ఉదయభాను తెలిపారు. తాను ఎప్పుడూ సెలెక్టివ్ గా ఉంటానని చెప్పారు. చిన్న ఇంటర్వ్యూలు చేస్తే చిన్న యాంకర్ల భవిష్యత్తు దెబ్బతీసినట్టు అవుతుందనే



భావనతో చిన్న ఇంటర్వ్యూలు ఒప్పుకునేదాన్ని కాదని తెలిపారు. త్వరలోనే అన్ని విషయాలను బహిర్గతం చేస్తానని... ఆ రోజు వచ్చినప్పుడు పెద్ద యుద్ధాలే జరుగుతాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో తనకు జరిగిన అన్యాయాలను బహిరంగంగా చెపుతానని... ఆరోజు పెద్ద రచ్చ జరుగుతుందని చెప్పారు. తాను ఎవరినో కించపరచడానికి మాట్లాడటం లేదని... వచ్చే తరం వారికి కొద్దిపాటి అవగాహన కల్పించేందుకే మాట్లాడుతున్నానని అన్నారు. తన అభిప్రాయాలలో ఉండే ఫిలాసఫీ కెరీర్ నేర్పిన జీవిత పాఠాల వల్ల వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఒక పుస్తకాన్ని రాస్తున్నానని చెప్పారు.

# సరోగసి పేరుతో శిశు విక్రయాలు

- పేద మహిళలకు డబ్బులు ఆశ చూపి పిల్లల సేకరణ
- డాక్టర్ నమ్రత నేరాంగీకార పత్రంలో పోలీసులు వెల్లడి




**హైదరాబాద్,ఆగస్ట్16( వెలుతురు):**

దేశ వ్యాప్తంగా కలకలం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ- సెంటర్ కేసుకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. డాక్టర్ నమ్రత నేరం అంగీకరించినట్లు కన్ఫెషన్ రిపోర్ట్‌లో పోలీసులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ సృష్టి ఫెర్టిలిటీ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో నిందితురాలు డాక్టర్ నమ్రత నేరాంగీకార పత్రంలో కీలక అంశాలు నమోదు చేశారు. నమ్రత నేరాన్ని అంగీకరించినట్లు- పోలీసులు పేర్కొన్నారు. నేరాంగీకార పత్రంలోని వివరాల ప్రకారం.. విజయవాడ, సికింద్రాబాద్, విశాఖలో ఫెర్టిలిటీ- సెంటర్లు నడిపారు. సరోగసి పేరుతో నమ్రత రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు వసూలు చేశారు. ఏజెంట్లను నియమించుకొని పిల్లలను కొనుగోలు చేశారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు డబ్బులు ఆశచూపి శిశువు విక్రయానికి ఒప్పందం చేసుకున్నారు. ప్రసవం తర్వాత బాలింతల నుంచి పిల్లల్ని కొనుగోలు చేశారు. ఆ పిల్లలను సరోగసి ద్వారా పుట్టిన వారిగా నమ్మించారు. పై విషయాలతో పాటు.. పలు పోలీసు స్టేషన్లలో తనపై కేసులు నమోదైనట్లు- నమ్రత ఒప్పుకొన్నారు. ఆ కన్ఫెషన్ రిపోర్టు ప్రకారం డాక్టర్ నమ్రత ఏం చెప్పిందంటే.. '1998లో మొదటిసారి విజయవాడలో ఫెర్టిలిటీ- సెంటర్‌ను స్థాపించారు. 2007లో సికింద్రాబాద్లో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించాను. ఆ తర్వాత వైజాగ్‌లోనూ మరో ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభించాను. తన రెండవ కుమారుడు జయంతికృష్ణ న్యాయవాదిగా ఉంటూ సహకరించేవాడు. సరోగసి పేరుతో ఒక్కో జంట దగ్గర 20 నుండి 30 లక్షల వరకు వసూలు చేశారు. ఏజెంట్ల ద్వారా పిల్లలను కొనుగోలు చేసేవారు. అబార్షన్ కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణీలను గుర్తించి వారికి డబ్బులు ఆశ చూపారు. ప్రసవం తర్వాత వారి పిల్లల్ని కొనుగోలు చేశారు. ఎంతోమంది పిల్లలు లేని దంపతులకు సరోగసి ద్వారా పుట్టిన పిల్లలుగా నమ్మించారు. మొదట మహారాణిపేట పోలీస్ స్టేషన్లో నమ్రత మీద కేసు నమోదు అయింది.

ఆ తరువాత వైజాగ్ టూ టౌన్ , గోపాలపురం పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు.. గుంటూరు కొత్తపేటలో మరో కేసు నమోదైంది. 2020లో మహారాణిపేటలో నమోదైన కేసులో రిమాండ్‌కు వెళ్లి వచ్చారు. పిల్లల్ని కొనుగోలు చేయడంలో సంజయ్‌తో పాటు సంతోషి కీలకంగా వ్యవహరించారు. సికింద్రాబాద్ సెంటర్లో సూపర్వైజర్ కం ఫార్మసిస్ట్‌గా కృష్ణ.. రిసెప్షనిస్ట్‌గా పద్మ.. -టెలికాలర్‌గా అర్చన, మేరీ, సోనా..నర్సుగా సురేఖ.. ల్యాబ్ టెక్నీషియన్‌గా ప్రభాకర్ ఉన్నారు. వైజాగ్ సెంటర్లో మేనేజర్‌గా కళ్యాణి, ల్యాబ్ టెక్నీషియన్‌గా రమ్య ఉన్నారు. విజయవాడలో డాక్టర్ మధులత, డాక్టర్ కిషోర్ బాబు, డాక్టర్ కరుణ కీలకంగా వ్యవహరించారు. అనస్తీషియా డాక్టర్‌గా గాంధీ హాస్పిటల్‌కి చెందిన సదానందం కీలకంగా ఉన్నారు. డబ్బు మొత్తాన్ని వివిధ బ్యాంకులకు బదిలీ చేసేవారు. సరోగసి కేస్ షీట్లు- మొత్తాన్ని ఎవరు ముట్టుకోకుండా భద్రంగా దాచేవారు. కన్సల్టెన్సీ రూమ్‌లో ప్రత్యేక బాక్సులో వీటిని భద్రపరిచారు. గోపాలపురంలో ఫిర్యాదు చేసిన రాజస్థాన్ దంపతుల కేస్‌లో సరోగసి ద్వారా బిడ్డను ఇస్తానని హామీఇ÷-చారు. అక్కడే తేడా కొట్టడంతో డొంకంతా కదిలింది.

# యువతకు వల వేసిన బీహార్ సిఎం

- కోటి ఉద్యోగాల ఆశ చూపెడుతూ ప్రకటన
- మరోమారు అధికారమే లక్ష్యంగా కొత్త ఎత్తుగడ



**పాట్నా,ఆగస్ట్16( వెలుతురు):**

బీహార్‌లో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈసారి కూడా తానే ముఖ్యమంత్రి అవ్వాలని, తమ పార్టీనే మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు- చేయాలని నితీష్‌కుమార్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే కొన్ని కీలక హామీను ఆయన ప్రకటించారు. తాజాగా ఆయన శనివారం బీహార్‌లోని కోటి మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ప్రకటించారు. ఆ రాష్ట్రంలోని పరిశ్రమలను ప్రోత్సహించడానికి, యువత భవిష్యత్తు భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని నిర్ణయించినట్లు- నితీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆయన 2020లో ఇచ్చిన ఏడు హామీల్లో.. యువతకు ఉపాధి కల్పించడం కూడా ఉంది. గతంలో 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పిస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలు అందిస్తామని ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నెరవేర్చిందని నితీష్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'మేము మరోసారి అధికారంలోకి వస్తే.. కోటి మందికి ఉద్యోగాలు, ఉపాధిని కల్పించాలని లక్ష్యంగా పెట్టు-కున్నాం. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు-కు, స్వయం ఉపాధి పొందేవారికి ప్రభుత్వం వివిధ సౌకర్యాలను అందించడం ద్వారా ప్రోత్సహిస్తుంది. అలాగే కొత్తగా పరిశ్రమలు స్థాపించడానికి, ప్రైవేట్ రంగాలను ప్రోత్సహించడానికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని అందివ్వడం జరుగుతుంది. ప్రత్యేకించి పరిశ్రమలను ప్రోత్సహించడానికి వాటికందించే మూలధన సబ్సిడీ, వడ్డీ సబ్సిడీ, జిఎస్‌టి కోసం అందించే ప్రోత్సాహక మొత్తాన్ని రెట్టింపు చేస్తాం. పరిశ్రమల స్థాపనకు అన్ని జిల్లాల్లో భూమిని అందిస్తాం. అలాగే ఎక్కువ మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలకు భూమిని ఉచితంగా అందిస్తాం అని నితీష్ కుమార్ తెలిపారు. బీహార్ యువత ఎంతో నైపుణ్యం కలిగినవారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం.. వారి భవిష్యత్తు భద్రత కోసం చర్యలు తీసుకోవడం అవసరం అని నితీష్ కుమార్ పేర్కొన్నారు.

# సెలవులతో శ్రీశైలంలో భక్తుల రద్దీ

- భారీగా తరలి వచ్చిన భక్తులు



**నంద్యాల,ఆగస్ట్16( వెలుతురు):**

శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం భక్తులు తరలివస్తున్నారు. వారాంతపురు వరుస సెలవులు రావటంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. పవిత్రమైన శ్రావణమాసం... జనాలు గుళ్ల బాట పట్టారు. శ్రావణమాసం చివరి వారం కావడంతో శ్రీశైలం మల్లన్న ఆలయానికి పో-టె-త్తారు. మల్లన్న క్షేత్రంలో భక్తులు రద్దీ భారీగా పెరిగింది. కృష్ణాష్టమి విశేషమైన రోజు కావడంతో భక్తులు తెల్లవారుజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తుల రద్దీ కారణంగా ఈనెల 18 వరకు శ్రీస్వామివారి గర్భాలయ,అభిషేకాలు సామూహిక అభిషేకాలు.. నిలిపివేశారు. శ్రీమల్లికార్జున స్వామివారి స్పర్శ దర్శనం కూడా రద్దు చేసి భక్తులందరికి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతిస్తున్నారు. ఇప్పటికే క్యూ కాంప్లెక్స్‌లు భక్తులతో నిండిపోయాయి. సర్వదర్శనానికి గంటల తరబడి వేచి చూస్తున్నారు. శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. శ్రీస్వామి అమ్మవారి దర్శనానికి సుమారు గంట నుండి 2 గంటల సమయం పడుతుంది. భక్తుల రద్దీ పెరగడంతో ఆలయ క్యూలైన్లలో భక్తులు ఇబ్బందులు కలుగకుండా అల్పాహారం... మంచినీరు ...బిస్కెట్స్... పాలు అందిస్తున్నామని ఆలయ ఈవో తెలిపారు

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

- కిన్నరసానికి భారీగా వరదనీరు చేరిక



**భద్రాచలం,ఆగస్ట్16( వెలుతురు):**

గోదావరి పరివాహకంలో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం(ఇరశసశ-రశశెప) వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. నీటిమట్టం శుక్రవారం ఉదయం 6 గంటలకు 23.6 అడుగులకు చేరింది. 12 గంటలకు 25.4, 4గంటలకు 26.3అడుగులకు చేరగా.. రాత్రికి 28 అడుగుల వరకు చేరే అవకాశం ఉన్నట్టు- అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా భద్రాచలం గోదావరి స్నానఘట్టాలపై నుంచి నీరు ప్రవహిస్తోంది. భక్తులు, పర్యాటకులకు తెలిసేందుకు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు- చేశారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. 404.70 అడుగులకు నీటి మట్టం పెరిగింది. మహబూబాబాద్ జిల్లాలోని పాకాల కొత్తగూడం నుంచి గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం అటవీ ప్రాంతాల నుంచి జలాశయానికి 1,700 క్యూసెక్కుల చొప్పున నీరు చేరడంతో డ్యాం అధికారులు అప్రమత్తమయ్యారు. డ్యాం సామర్థ్యం 407 అడుగులు కాగా 404.70 అడుగులకు నీరు చేరడంతో లోతట్టు- ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. జలాశయం దిగువ ప్రాంతం లో ఉన్న లోతట్టు- గ్రామాల ప్రజలు వాగులు దాటొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

# తెలంగాణకు భారీ వర్షసూచన

- వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- ఆదిలాబాద్ జిల్లాలో దంచికొడుతున్న వానలు
- సింగూరు గేట్లు ఎత్తడంతో మూసుకున్న వనదుర్గామాత ఆలయం




**హైదరాబాద్,ఆగస్ట్16( వెలుతురు):**

తెలంగాణ రాష్ట్రంలోని నాలుగు జిల్లాలకు భారత వాతావరణ విభాగం ఐఎండీ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలో భారీవర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు.. వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఉద్యోగస్తులు వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు. అవపరమైతే తప్ప జనాలను బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు ఐఎండీ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మరో పదకొండు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసి.. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో 3రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇదిలావుంటే ఆదిలాబాద్ జిల్లాలో కుండపోతగా వర్షం కురుస్తున్నది. జిల్లాలోని పలు జిల్లాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపిలేకుండా వాన పడుతున్నది. దీంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తు న్నాయి. సిరికొండ మండలం లో చికమాగన్ వాగు ఉప్పొంగింది. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నార్నూర్, గాదిగూడ మండలాల్లో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలలో వర్షపునీరు చేరి జలమయమయ్యాయి. గాదిగూడ మండలంలోని ఖడ్కి, లోకారికే, అర్జుని, దాబా, మేడిగూడ, చిత్తగూడ, నార్నూర్‌లోని బాబేఝరి ప్రధాన రహదారులపై లో లేవల్ కల్వర్టులపై వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి ఉమ్మడి మండలంలోని జనం ఇండ్లకే పరిమితమయ్యారు. అత్యవసర సమయంలోనే బయటికి రావాలని, సమస్యలుంటే నేరుగా సంబంధిత శాఖ లేదా డయల్ 100కి సమాచారం అందించాలని నార్నూర్ సీఐ పేందూర్ ప్రభాకర్ తెలిపారు. ఉట్నూరు మండలం దంతనపల్లి వద్ద రోడ్డుపై చెట్లు- కూలిపడిపోయింది. దీంతో ఉట్నూరు నుంచి జన్నారం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా మెదక్ జిల్లాలో సింగూరు ప్రాజెక్ట్ కు భారీగా వరద చేరడంతో గేట్లు- ఎత్తారు. వరద తాకిడితో ఏడుపాయల వనదుర్గా అమ్మవారి దేవాలయాన్ని మూసేశారు. మెదక్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయాన్ని పూజారులు, అధికారులు మూసివేశారు. సింగూరు ప్రాజెక్టు గేట్లు- ఎత్తడంతో అమ్మవారి ఆలయం వద్ద మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ఉధృతి తగ్గిన తర్వాత ఆలయాన్ని తెరుస్తామని అధికారులు తెలిపారు. అప్పటి వరకూ రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగుతాయని వెల్లడించారు. ఏటా భారీ వరద పో-టె-త్తడంతో అమ్మవారి ఆలయాన్ని ఇలా మూసివేస్తారు.

# కంగనా రనౌత్ ద్విపాత్రాభినయం

- అటురాజకీయం ..ఇటు సినిమా రంగం
- ఆడవారి నెలసరి బాధలపై హాట్ కామెంట్స్



**న్యూఢిల్లీ,ఆగస్ట్16( వెలుతురు):**

నటి, ఎంపి కంగనా రనౌత్ ఏ విషయంలో అయినా ముక్కుసూటిగా ఉంటారు. ఎంపిగా ఆమె హిమాచల్ మండి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నెలసరి సమయంలో ఉండే బాధ, ఇబ్బందులు సామాన్య మహిళలకే కాదు.. సెలబ్రిటీలకు తప్పవన్నారు నటి, ఎంపీ కంగనా రనౌత్. వారు కూడా ఈ సమస్యలకు అతీతం కాదన్నారు. సినీరంగం నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేసిన కంగనా తాజాగా ఈ రెండు రంగాలను పోలుస్తూ మహిళగా తాను ఎదుర్కొంటున్న సమస్యను పంచుకున్నారు. ఈ రెండు రంగాలు పూర్తిగా భిన్నమైనవి. ఇండస్ట్రీలో హీరోయిన్స్‌కు కారవాన్‌లు ఉంటాయి. అవుట్‌డోర్ చిత్రీకరణల సమయంలో ప్రత్యేకమైన సదుపాయాలు కూడా చిత్రబృందం ఏర్పాటు చేస్తుంది. దాంతో పీరియడ్స్ సమయంలో మరింత శ్రద్ధ తీసుకునే వీలుంటుంది. వాష్‌రూమ్‌లకు వెళ్లే సదుపాయం ఉంటుంది. విశ్రాంతి కూడా తీసుకోవచ్చు. అవసరం అనుకుంటే టీమ్‌తో చెప్పి మినరల్ వాటర్‌ను కూడా వేడి చేసి ఉపయోగించుకోవచ్చు. కానీ, ఇప్పుడు నేను ఉంటోన్న రంగం పూర్తిగా వేరు. ఒక్కోసారి పర్యటనలో భాగంగా రోజుకు 12 గంటలు ప్రయాణించాల్సి వస్తుంది. కనీసం టాయిలెట్‌కు వెళ్లడానికి కూడా ఉండదు. నాకే కాదు.. ఇతర ఎంపీలకు కూడా ఇదే సమస్య ఉంది. అందరూ అనుకునేంత చిన్న ఇబ్బంది కాదిది. పెద్ద విపత్తుతో పోల్చొచ్చు. దీన్ని వర్ణించడం కూడా అసాధ్యం అని తెలిపారు. తన నటనతో నాలుగు జాతీయ అవార్డులను సొంతం చేసుకున్న ఈ నటి.. 2024లో భాజపా తరఫున హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో ఎంపీగా పోటీ- చేసి విజయం సాధించారు. అమ్మాయిలు వయసులో ఉండి ఏదైనా సాధించాలనే పట్టుదలతో ఉన్నప్పుడు ఒక పెళ్లి అయ్యి పిల్లలు ఉన్న వ్యక్తి మీతో సంబంధం పెట్టుకోవాలని ప్రయత్నిస్తే అది మగవాడి తప్పు కాదు. మీరు పెళ్ళి అయిన వాళ్ళతో సంబంధం పెట్టుకోవడం మీ తప్పు అని జనాలు ఎప్పుడూ మహిళను తప్పుగా చూస్తారు. ఇలాంటి సందర్భాల్లో అమ్మాయి తప్పు చేసినట్లే, మగవాడి తప్పు చేశాడు అని ఎవరు అనుకోరంటూ కంగనా అభిప్రాయపడింది. అలాగే డేటింగ్ యాప్స్ వాడకం గురించి కంగనా మాట్లాడుతూ.. ఇవి సమాజంలో మురికి కాలువ లాంటివని.. ఆత్మవిశ్వాసం లేనివారు, ఎవరో ఒకరి గుర్తింపు కోసం చూసేవాళ్లు మాత్రమే ఇలాంటివి వాడుతారని కంగాన చెప్పుకోచ్చింది. పెద్దలు కుదిర్చిన వివాహం ద్వారా అయిన లేదా చదువుకున్న -టైంలో అయిన అమ్మాయిలు తమ పార్ట్‌నర్‌లను వెతుక్కోవాలని కంగనా సూచించింది. అలాగే లివ్-ఇన్ రిలేషన్‌లు అమ్మాయిలకు సురక్షితం కాదని కంగనా చెప్పుకోచ్చింది. ఇలాంటి రిలేషన్‌లో అమ్మాయిలకు గర్భం వస్తే కుటుంబం నుంచి సరైన తోడు ఉండదని చెప్పుకోచ్చింది. ఇకపోతే నెలసరి బాధలపై ఇటీవల నటి జాన్వీ కపూర్ కూడా స్పందించిది. అబ్బాయిలకు ఈసమస్య ఉంటే తెలిసేదని వ్యాఖ్యానించింది.

## చందానగర్ ఖజానా దోపిడీని ఛేదించిన పోలీసులు

- నిందితులను అదుపులోకి తీసుకుని సొత్తు స్వాధీనం




**హైదరాబాద్,ఆగస్ట్16( వెలుతురు):**

హైదరాబాద్ చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ప్రత్యేకబృందాలు నిఘా పెట్టి వారిని పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి నాటు తుపాకులు, బులెట్లు- స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను మాదాపూర్ డీసీపీ వినీత్ మీడియాకు వెల్లడించారు. నిందితులు ఖజానా జ్యువెలరీ వద్ద 20 రోజులు రెక్కీ నిర్వహించినట్లు- తెలిపారు. దోపిడీకి మొత్తం ఏడుగురు వ్యక్తులు వచ్చినట్లు- పేర్కొన్నారు. బైకులపై వచ్చి దోపిడీ చేసి, మళ్లీ బైకులపైనే పరారయ్యారు. నకిలీ నంబర్ ప్లేట్లతో వచ్చి చోరీకి పాల్పడి.. ఆ తర్వాత వాటిని మార్చుకున్నారు. నగర శివారులో, భద్రతాసిబ్బంది ఎక్కువగా లేని దుకాణాన్ని ఎంచుకొని దోపిడీకి పాల్పడ్డారు. 10 కిలోల వెండి ఆభరణాలు, వస్తువులతో పరారయ్యారు. ఈ ముఠా గతంలో కోల్‌కతా, బిహార్, కర్ణాటకలో దోపిడీలకు పాల్పడినట్లు- గుర్తించాం. రెండేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉన్నారు. ఈ బిహార్ ముఠా హైదరాబాద్‌లో చేసిన తొలి చోరీ ఇది. ఇతర రాష్ట్రాలకూలీలను నియమించుకునేవాళ్లు జాగ్రత్తగా ఉండాలి. కూలీలకు ఏమైనా నేర చరిత్ర ఉందా అని ఆరా తీయాలి. లేబర్ సప్లయ్ ఏజెన్సీలు తమ వద్దకు వస్తున్న వారి వివరాలు మాకు ఇస్తే బాగుంటుందని వినీత్ తెలిపారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com